ప్రజాశక్తి

ఆదివారం 28 ఏప్రిల్ 2024 8 పేజీలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

రాష్ట్రంలో దొంగలు పడ్డారు..!

- ◆ప్రజలే కాపాడుకోవాలి.. చంద్రబాబు
- ◆మెగా డిఎస్‌సిపై తొలి సంతకం చేస్తా..
- ◆సేవా భావంతో పనిచేసే వ్యక్తి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి
- ◆అనుభవం ఉన్న వ్యక్తి ఆనం రామనారాయణ రెడ్డి
- ◆మంచికి ఓటేయండి .. ధర్మాన్ని కాపాడండి..
- ◆ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెంలో ప్రజాగళం సభలు

బుచ్చిరెడ్డిపాలెం ప్రజాగళం సభలో మాట్లాడుతున్న టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్/ బుచ్చిరెడ్డిపాలెం

రాష్ట్రంలో దొంగలు పడ్డారు.. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలపై ఉందని మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శనివారం నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ పరిధిలోని నెల్లూరు పాలెం సెంటర్లోని తిరుపతి నాయుడు విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన ప్రజా గళం బహిరంగ సభ లో మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగుతోందని దాన్ని అంతమొందించాలంటే తెలుగుదేశం అధికారంలోకి రావాలన్నారు యువతకు ఉద్యోగ అవకాశాలు కావాలంటే బాబు రావాలి. యువతకు మాదకద్రవ్యాలు కావాలంటే జగన్ రావాలి. జగన్మోహన్ రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టో అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. టిడిపి రిలీజ్ చేసిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిందన్నారు.నాడు కీర్తిశేషులు ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు హయాంలో సోమశిల తెలుగు గంగ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడంతో పంటలు సస్యశ్యామలంగా పండుతున్నాయన్నారు. నెల్లూరు వ్యవసాయ శాఖ మంత్రి కేవలం జిల్లాలోని గనుల పైనే ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు తప్ప వ్యవసాయం పైన కాదన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే పోలవరం పూర్తిచేసి చిన్నపిల్లలు అనుసంధానం చేస్తాం.. మద్యపాన నిషేధం చేస్తానని హామీ ఇచ్చి రాష్ట్రంలో విచ్చలవిడిగా జగన్ రెడ్డి లిక్కర్ తో ఆడపడుచుల మంగళ సూత్రాలు తెంచుతున్న దుర్మార్గుడని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు అధి.కారంలోకి వచ్చిన వారంలోనే సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చిన జగన్ ప్రభుత్వం ఉద్యోగులను మోసం చేశాడన్నారు. అధి కారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగులు ఇస్తామని హామీ ఇచ్చారు . మెగా డిఎస్‌సికి మొదటి సంతకం చేస్తానన్నారు.ఆత్మకూరు నియోజక వర్గంలో అనుభవమున్న రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డిని అత్యధిక మెజా ర్టీతో గెలిపించా లన్నారు. ఆయన నమ్మకం ఉన్న వ్యక్తిని,అన్ని ▶ 2లో

సంపన్నుల ఆస్తులను పెంచుతున్న బిజెపి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి

ఓటర్లను అభ్యర్థిస్తున్న మూలం రమేష్

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజల నుంచి పన్నుల పేరుతో విపరీతంగా నగదు వసూళ్లు చేస్తున్న బిజెపి, ప్రజల రక్తాన్ని పీల్చిపిప్పిచేస్తూ సంపన్ను పరుల ఆస్తులను పెంచేందుకు కృషి చేస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి పేర్కొన్నారు. శనివారం నెల్లూరు నగర అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న వామపక్ష పార్టీలు, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, విసికె పార్టీలు కలిసిన ఇండియా బ్లాక్ బలపరిచిన అభ్యర్థి మూలం రమేష్ 14వ డివిజన్ ప్రాంతంలో ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో పది సంవత్సరాలు అధికారంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలకు చేసిన హామీలు అమలు చేయకుండా వైఫల్యం చెందినదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల ప్రచార కార్యక్రమంలో తమకు 400 సీట్లు దక్కుతాయని బూటకపు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పదారి పట్టిస్తు ందన్నారు. అధికారంలో ఉన్నన్ని రోజులు కేవలం ఆరుగురి సంపదను పెంచడానికి బిజెపి పనిచేయలేదా అని ప్రశ్నించారు. ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించడంలో వైఫల్యం చెంది, సంస్కరణల పేరుతో పన్నులు పెంచి వసూళ్లు చేయడంలో ▶ 2లో

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

ప్రజాశక్తి-నెల్లూరు :ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్ సంబంధిత అధికారులు ఆదేశించారు. జిల్లాకు స్టార్ క్యాంపెనర్లు ప్రచా రానికి వస్తున్నందున కోడ్ ఉల్లంఘన జరగకుండా నిశితంగా ఒపరిశీలిం చాలన్నారు. శనివారం అయన జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటిలి జెన్స్ విభాగం మద్యం డంప్‌లు ఎక్కడున్నాయో గుర్తించి సీజ్ చేయాలన్నారు. ఎస్ ఎస్ టి, ఎఫ్ ఎస్ టి, ఎక్స్పెండిచర్ బృందాలు తనిఖీలు ముమ్మరం చేసి సీజర్ల మీద దృష్టి పెట్టాలన్నారు. చెక్ పోస్టుల దగ్గర ప్రతి వాహనాన్ని తనిఖీ ▶ 2లో

మతోన్మాద బిజెపిని గద్దెదించండి.. ▶ 8లో

రూ. 11.70 లక్షల నగదు స్వాధీనం ▶ 8లో

'సోమశిల' హైలెవల్ కెనాల్ పనులు పూర్తి చేయాలి ▶ 6లో

నేడు కందుకూరుకు సిఎం జగన్ రాక

బందోబస్త్ ఏర్పాట్లు పరిశీలించిన ఎస్‌పి

సభ జరిగే ప్రాంతంలో పరిశీలిస్తున్న ఎస్‌పి ఆరీఫ్

ప్రజాశక్తి - కందుకూరు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కందుకూరు రానున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఎస్‌పి ఆరిఫ్ కందుకూరుకు చేరుకొని ముఖ్యమంత్రి భద్రత ఏర్పాట్లపై పర్యవేక్షించారు. తొలుత ముఖ్యమంత్రి హెలిప్యాడ్ స్థలమైన వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని పరిశీలించారు. అక్కడ హెలీప్యాడ్ స్థలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలను కూడా ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి షెడ్యూలు రూట్ మ్యాప్ లోని అంకమ్మ దేవాలయం, పోస్టాఫీస్ సెంటర్ల లోని రహదారి భద్రతను చూశారు. అక్కడి నుండి నేరుగా ముఖ్యమంత్రి బహిరంగ ప్రదేశమైన ఎన్టీఆర్ సర్కిల్ కు చేరుకుని దాదాపు గంటకు పైగా అక్కడ పరిస్థితులను ఎస్‌పి అధ్యయనం చేశారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లోనే బహిరంగ సభ పెడితే ఎలా ఉంటుందన్న దానిపై అధికారులతో ఆయన చర్చించారు. అయితే గతంలో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ఇక్కడ పెట్టిన బహిరంగ సభలో జరిగిన అపశృతి అంశాలను పరిగణ లోకి తీసుకున్న అధికారులు ఆ స్థలానికి బదులుగా ప్రత్యామ్నాయ స్థలాన్ని ▶ 2లో

బాబు..సర్దుకోండి..!

దరఖాస్తుదారులకు బుజ్జగింపులు - రేపు నామినేషన్లు ఉపసంహరణ

సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ ఘట్టం ముగిసింది. శుక్రవారం పరిశీలిన చేశారు. 47 మంది అభ్యర్థుల నామినేషన్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. రేపు నామినేషన్లు ఉప సంహరణ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఎంపి, ఎంఎల్ఎ అభ్యర్థులకు ధీటుగా ఇండిపెండెంట్లు పెద్దఎత్తున నామినేషన్ దాఖలు చేశారు. వీరిని బుజ్జగించడానికి అనేక రకాల ప్రయత్నాలు సాగుతున్నాయి. బాబు సర్దుకోండి అంటూ సర్దిచెప్పే ప్రయత్నాలు చేస్తున్నారు. అభ్యర్థు లందరూ తమ కుటుంబ సభ్యుల పేరుతో రెండు మూడు నామినేషన్లు దాఖలు చేశారు. ఇవన్నీ పోయిన తరువాత రేపు నామినేషన్ ఉప సంహరణ తరువాత సాయంత్రం తుదిజాబితా, గుర్తుల కేటాయింపులు జరగనున్నాయి..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ ప్రక్రియకు చివరి అంకం నేడు ముగియనుంది. ఈ నెల 18 నుంచి నామినేషన్లు స్వీకరించారు. రేపు నామినేషన్లు ఉప సంహకరణ తరువాత బరిలో ఉంటే అభ్యర్థుల తుదిజాబితా అధికారులు ప్రకటిచనున్నారు. నెల్లూరు పార్లమెంట్ స్థానానికి మొత్తం 21 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అందులో ఆరుగురిని తిరస్కరించారు. 15 మంది ఉన్నారు. వీరి మూడు పార్టీలకు సంబంధించి అభ్యర్థుల తరువాత పిరమిడ్ పార్టీ, బిఎస్‌పి, ఇండిపెండెంట్లు అభ్యర్థులు అధికంగా ఉన్నారు. బ్యాలేట్ నమూనలో ఎక్కువ మంది అభ్యర్థులంటే నష్టం జరగడంతోపాటు, ఓట్లు చీలుతాయనే భయంతో టిడిపి, వైసిపి అభ్యర్థులు ఇండిపెండెంట్ అభ్యర్థులను బుజ్జగించే పనిలో ఉన్నారు. నామినేషన్ వేసిన అభ్యర్థులతో ఫోన్లోలో మాట్లాడుతన్నట్లు తెలుస్తోంది. లెక్కల తరువాత ఎందరో నామినేషన్ ఉప సంహరించుకుంటారో చూడాల్సి ఉంటుంది. కాంగ్రెస్ కెరాజు, టిడిపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వైసిపి విజయ సాయిరెడ్డి మద్యప్రధాన పోటీ జరగనుంది. ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు మొత్తం 171మంది నామినేషన్లు దాఖలు చేశారు. అందులో 41 మందిని అభ్యర్థులు తిరిస్కరిం చారు. 130 మంది నామినేషన్లు వేశారు. ▶ 2లో

సంపన్నుల ఆస్తులను పెంచుతున్న బిజెపి

మొదటి పేజీ తరువాయి

ముందడుగు వేసిందన్నారు. ఈ సంపదను తీసుకొచ్చి మెజార్టీ ప్రజలు, నా హిందూ ప్రజలు అనిచెప్పుకుంటున్న వారికి కాని, ముస్లిం, మైనార్టీలకు, క్రిస్టియన్లకు, ఇతర వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి ఖర్చు చేసిందా అని ప్రజలకు చెప్పాలన్నారు. ప్రజలకు న్యాయమైన హక్కులను పంచి ఇచ్చే ధైర్యం కేంద్ర ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. ఇండియా బ్లాక్ పేరుతో సిపిఎం అభ్యర్థిగా నగర అసెంబ్లీ స్థానానికి మూలం రమేష్ పోటీ చేస్తున్నారన్నారు. ఆయన ఎన్నికల గుర్తు సుత్తికొడవలి నక్షత్రంపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు.

నగర అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి మూలం రమేష్ మాట్లాడుతూ నగరంలో అనేక ప్రజా ఉద్యమాలకు సిపిఎం శ్రీకారం చుట్టిందన్నారు. కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు ప్రభుత్వం పెంపుదల చేసేందుకు, రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోని సమయంలో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ మున్సిపల్ కార్మికుల హక్కులకు బంగం కలిగే విధంగా జీఓలు అమలు చేసేందుకు ప్రయత్నించిన సమయంలో కార్మికులు చేసిన పోరాటానికి సిపిఎం అండగా నిలిచిందన్నారు. ఆ సమయంలో మున్సిపల్ కార్మికులపై సిపిఎం నాయకులపై టిడిపి ప్రభుత్వం పోలీసు కేసులు బనాయించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోని వైసిపి ప్రభుత్వం సైతం టిడిపి ప్రభుత్వం నడిచిన బాటలోనే పయనిస్తుందన్నారు.

ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడారు. సిపిఎం అభ్యర్థి మూలం రమేష్ ఎన్నికల గుర్తు సుత్తికొడవలి నక్షత్రంపై, పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.రాజు ఎన్నికల గుర్తు హస్తంపై వేసి గెలిపించాలని పిలుపు నిచ్చారు.కార్యక్రమంలో నాయకులు కటికాల వెంకటేశ్వర్లు, కాయం శ్రీనివాసులు, పి.సూర్య నారాయణ, పాటల శీనయ్య, కిన్నెర కుమార్, అల్లంపాటి శ్రీనివాసురెడ్డి, ఆయా డివిజన్ల సిపిఎం శాఖ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక 43,40వ డివిజన్లలో సిపిఎం కార్యకర్తలు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య, కొండా ప్రసాద్, ఎన్.మాలకొండయ్య, ఎస్‌కె ఖలీల్, విజయమ్మ, కె.కృష్ణమూర్తి, యు గోపాల్, నిప్పో బాషా, ఏక్బాల్, నాగేశ్వరరావు, ఎస్‌కె ఖాదర్‌బాషా, నాగిరెడ్డి, అంజిరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

49, 50 డివిజన్లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి గోపాల్, ఆలూరు తిరుపాలు, గంటా లక్ష్మీపతి, పూడిపర్తి జనార్ధన్, మల్లె సింహగిరి, దారా శివయ్య, జానా లక్ష్మీ ప్రసాద్,అచ్చి అనంతయ్య, శ్రీపతి వెంకయ్య, శ్రీపతి నరసయ్య, పెంచలయ్య, ప్రసాద్, రసూల్, అశోక్ పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు

మొదటి పేజీ తరువాయి

చేయాలన్నారు. ఆటోలు ,ద్విచక్ర వాహనాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జిల్లాలో విధులు కేటాయించబడిన వారు మే ఒకటో తేదీలోగా పోస్టల్ బ్యాలెట్ కోసం ఫామ్ 12 అందజేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ కోసం అనువైన పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ స్కిల్ డెవలప్మెంట్ లో శిక్షణ పొందిన వారిని వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్.లవన్న నోడల్ అధికారులు బాపురెడ్డి ,వెంకట్రావు ,పద్మావతి, అనిత రాణి, ఎస్ రాజు ,రాజశేఖర్ పాల్గొన్నారు.

మాలకొండ' ఆదాయం రూ.10.58 లక్షలు

ప్రజాశక్తి - వలేటివారిపాలెం

మండలంలోని అయ్యవారిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తుల నుంచి వివిధ రూపాల ద్వారా రూ 1058418 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె. బి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ అర్చకులు గౌరీ శంకర్, నసింహ చార్యులు స్వామి వారిని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు.

బాబు..సర్దుకోండి..!

మొదటి పేజీ తరువాయి

సర్వేపల్లిలో మొత్తం 17 మంది నామినేషన్లు వేయగా, నలుగురు ధరఖాస్తులు తిరస్కరించారు. 13 మంది నామినేషన్లు ఉన్నాయి. టిడిపి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి,వైసిపి కాకాణి గోవర్ధన్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ అభ్యర్థి రంగంలో ఉన్నారు. వీరి కటుంబ సభ్యులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరందరినీ ఉప సంహరించుకున్నా ఇండిపెండెట్ అభ్యర్థులను బుజ్జగించే పనిలో ఉన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 13 మంది నామినేషన్లు వేశారు. అందులో ఒక్కరిని తిరస్కరించారు. 12 మందిలో టిడిపి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి ఫయాజ్, వైసిపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. వీరు కాకుండా ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్ వేశారు. వీరందరినీ బుజ్జగించి ఉప సంహరించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. నెల్లూరు నగరం నుంచి సిపిఎం అభ్యర్థి మూలం రమేష్, టిడిపి పి.నారాయణ, వైసిపి ఖలీల్ అహ్మద్ పోటీలోఉన్నారు. ఇక్కడ అత్యధికంగా 26 మంది నామినేషన్లు వేశారు. 8 తిరస్కరించారు. 18 మంది నామినేషన్లు ఉన్నాయి. కావలి నియోజకవర్గంలో 25 మంది నామినేషన్లు వేశారు. 10 తిరస్కరించారు. 15 మంది ఉన్నారు. వీరిలో కావ్య కృష్ణారెడ్డి పేరుతో ఉండే మరో వ్యక్తి నామినేషన్ వేశారు. ఇండిపెండెంట్‌గా పసుపులేటి సుధాకర్ పోటీ పడుతున్నారు. బుజ్జగించడానికి ప్రయత్నాలు చేస్తున్నా ఫలించడం లేదు. ఇక్కడ నుంచి వైసిపి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. కందుకూరు, ఉదయగిరి, కోవూరు, ఆత్మకూరు నియోజకవర్గాల భారీగానే నామినేషన్లు ఉన్నాయి. కోవూరులో అత్యధికంగా 28 మంది నామినేషన్లు వేశారు. 9 తిరస్కరించినా, 19 మంది ఉన్నారు. ఇండిపెండెంట్‌లు అభ్యర్థులు భారీగా ఉన్నారు. వీరిని బుజ్జగించి నామినేషన్లు తిరస్కరింప చేయడానికి వేమిరెడ్డి టీమ్ ప్రయత్నాలు చేస్తుంది. నేడు అంతా అపనిలో ఉన్నా రేపు సాయంత్రం 3 గంటల లోపు నామినేషన్లు ఉప సంహరణ ఉంటుంది. అనంతరం తుది జాబితా ప్రకటిస్తారు.

రాష్ట్రంలో దొంగలు పడ్డారు..!

మొదటి పేజీ తరువాయి

విధాల అభివృద్ధి చేస్తారని తప్పక ఆయనను మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. సేవా భావం కలిగిన వ్యక్తి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నెల్లూరు జిల్లా ఎంపిగా పోటీ చేస్తున్నారని ఆయనకు డబ్బు అవసరం లేదన్నారు. ఉన్న డబ్బును ప్రజలకు పంచి పెట్టడమే ఆయనకు తెలుసునని ఇలాంటి వ్యక్తిని ఎంపిగా గెలిపించుకుంటే ప్రజలకు సేవ చేస్తారని ప్రజలందరూ ఆలోచించి మంచి వ్యక్తులను కల్పించుకుంటే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్ర శేఖర్ రెడ్డి, కొమ్మి లక్ష్మయ్య నాయుడు , కంభం విజయ రామిరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి కుమార్తె ఆనం కైవల్యారెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బ్రహ్మారెడ్డి, తాళ్లూరు గిరినాయుడు, రంగ మయూర్‌రెడ్డి, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెంలో సెంటర్‌లో బహిరంగ సభ జరిగింది. ఈసందర్భంగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఇక్కడున్న ఎంఎల్‌ఎని నాలుగుసార్లు గెలిపించానని తెలిపారు. సేవ చేసేందకు వేమిరెడ్డి దంపతులు రాజకీయాల్లోకి వచ్చారన్నారు. సోషల్ మీడియాలో ఆడబిడ్డ అని కూడా చూడకుండా కోవూరు అభ్యర్థి ప్రశాంతిరెడ్డిపై నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి దుష్ప్రచారం చేశాడన్నారు. ఇలాంటి వ్యక్తికి మహిళలపై ఎంత గౌరవం ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలని తెలిపారు. కుక్కల్లాగా మొరుగు తున్నారన్నారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు బెదిరే ప్రసక్తే లేదన్నారు. కనీసం తాగునీరు, రోడ్లు వేసిన పాపాన పోలేదన్నారు. కోవూరు టిడిపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ప్రసన్నకుమార్‌రెడ్డి అక్రమ సంపాదన అంతా హైదరాబాద్‌లో దాచిపెట్టుకున్నాడన్నారు. మహిళల పట్ల గౌరవంలేని ఎంఎల్‌ఎ అన్నారు. ఇలాంటి వారు మనకు అవసరమా అని తెలిపారు. ప్రసన్నకు ఇవే చివరి ఎన్నికలన్నారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మేము రాజకీయాల్లో వచ్చిందని డబ్బు సంపాదించుకోవడానికి కాదన్నారు.

ప్రజలకు సేవచేయడానికే నన్నారు. మోసపూరిత మాటలు చెప్పమన్నారు. చేసేదే చెబుతామని తెలిపారు. ప్రజలకు సేవచేయడమే మా ధ్యేయమన్నారు. జిల్లాలో ఎంతో మందికి సహాయ సహకారాలందించామన్నారు. అదే బాటలో తాము నడుస్తామన్నారు. కోవూరు టిడిపి అభ్యర్థి ప్రశాంతిరెడ్డిని, నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, బిజెపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు : ఉలవపాడు మండలం, కరేడు పంచాయతీకి చెందిన మక్కే మోషే, కొల్లూరి మహేష్, పోలుబోయిన శ్రీనివాసులు, పలువురు కందుకూరు నియోజకవర్గ టిడిపి కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో శనివారం టిడిపిలో చేరారు. వైసిపిలో తగిన గుర్తింపు లేదని, ఇంటూరి నాగేశ్వరరావు ఇస్తున్న భరోసాతో టిడిపిలో చేరుతున్నామని, రాబోయే ఎన్నికల్లో టిడిపి గెలుపే ధ్యేయంగా కష్టపడతామని కొత్తగా పార్టీలో చేరిన వారు తెలిపారు.క్లస్టర్ ఇంచార్జ్ పోలుబోయిన శ్రీనివాసులు, స్థానిక నాయకులు కొల్లి వెంకటరమణ, రేగలగడ్డ శ్రీను, మద్దెల శ్రీధర్, మల్లవరపు వెంకటరావు, మక్కే వెంక టేశ్వర్లు, ఎం.సాయి, బి.మురళి ఉన్నారు.5వ వార్డు బందావనం కాలనీకి చెందిన పలువురు వైసిపి నేతలు శనివారం కందుకూరు నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టిడిపిలో చేరారు. వైసిపి జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి సుదర్శి శ్యామ్, జంగాల వెంకటరావు, పి కరుణాకర్, సత్యనారాయణ, కట్టా వెంకట నారాయణ, గుమ్మడి సురేష్, అల్లాడి అజయ్ పార్టీలో చేరారు. కందుకూరులోని టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చదలవాడ కొండయ్య, వార్డు అధ్యక్షులు దాసరి ప్రమోద్, పాలేటి కోటేశ్వరరావు, గేరా నరేష్, జంగాల రాఘవ ఉన్నారు.



ప్రచారం చేస్తున్న ఇంటూరి సౌజన్య

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు కోవూరు రోడ్డు సాయిబాబా గుడి ప్రాంతంలో ఇంటూరి సౌజన్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టిడిపి కూటమి ఎంఎల్‌ఎ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. వార్డు అధ్యక్షుడు అత్తంటి శివకష్ణ, అత్తంటి వరప్రసాద్, పీలా శ్రీనివాసులు, చుంచు వేణు, జమ్ము చైతన్య, తెలుగు యువత అధ్యక్షుడు సవిడిబోయిన వెంకటకష్ణ, ముప్పవరపు వేణు, గుమ్మా శివ, మచ్చా మనోహర్, చల్లా మహేంద్ర, నందికనుమల లక్ష్మణరావు, ఓరుగంటి రామ్మూర్తి, తూమాటి రవిబాబు ఉన్నారు.

నేడు కందుకూరుకు సిఎం జగన్ రాక

మొదటి పేజీ తరువాయి

పరిశీలించారు. గుండంకట్ట రోడ్డు, విప్పగుంట రోడ్డు మధ్యలో పామూరు బస్టాండ్ వద్దనే బహిరంగ సభ పెడితే బాగుంటుందని పలువురు స్థానికులు అధికారులకు సూచించారు. ఎస్‌పి చుట్టుపక్కల ప్రజలు సీఎం సభా ప్రాంగణంలోకి చొరబడకుండా చుట్టూ బలమైన బారికేడ్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌పి వెంట బుర్రా మధుసూదన్ యాదవ్, కందుకూరు సబ్ కలెక్టర్ జి విద్యాధరి, డిఎస్‌పి శ్రీనివాస్, సిహెచ్ సౌజన్య ఉన్నారు.

వలేటివారిపాలెం : నేడు 3 గంటలకు సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా కదుకూరు రాన్నుట్లు వైసిపి మండల అధ్యక్షులు పరిటాల వీరస్వామి తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి-గుడ్లూరు : మండలంలో ఏర్పాటు చేసిన 46 పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు ,మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం వెంటనే కల్పించాలని ఓటర్లకి ఎలాంటి ఇబ్బందులు లేకుండా శ్యామ్యానాలు వేసి ఎండ ఏడిమి తగలకుండా చూడాలని స్థానిక ఎన్నికల అధికారులు బి అల్వాల్ తో ప్రత్యేక సమావేశం శనివారం జరిగింది. విద్యుత్తు ఏఈ శ్రీనివాసులు, తాసిల్దారు రమణమ్మ పాల్గొన్నారు.

వైసిపి మేనిఫెస్టో ఓ జిమ్మిక్కు : ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు : టిడిపి సూపర్ సిక్స్ పథకాల ముందు జగన్మోహన్ రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టో తేలిపోయిందని కందుకూరు నియోజకవర్గం కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. గతంలో ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పుడు వాటికి మసిపూసి మారేడు కాయ చేసేలా మేనిఫెస్టో ఉందని, ప్రజలు ఎవరు నమ్మే స్థితిలో లేరని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గుడ్లూరు మండలంలోని దప్పళంపాడు, మొగుళ్లూరు, చినలాటరిపి పంచాయతీల్లో శనివారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల ప్రజలు నాగేశ్వరరావుకి ఘన స్వాగతం పలికారు. **తెలుగు ప్రొఫెషనల్ వింగ్ ఆధ్వర్యంలో....** మేము సైతం-మన రాష్ట్రంకోసం అంటూ కందుకూరు నియోజకవర్గ తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ ఆధ్వర్యంలో దప్పళంపాడులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెషనల్స్ విత్ సీబీఎన్ పోస్టర్లను ఇంటూరి నాగేశ్వరరావు ఆవిష్కరించారు.

గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షులు పైడి ప్రసాద్, చిట్యాల యానాదయ్య, లక్కంరాజు హరిబాబు, పార్టీ నాయకులు గుత్తా మాలకొండయ్య, వలేటి వెంకటేశ్వర్లు, బత్తిన కొండయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ చెరుకూరి సూర్యనారాయణ, వలేటి వెంకట నరసింహం, తిరుపతి బుల్లియ్య, మేకల మాల్యాద్రి, కాపులూరి ప్రసాద్, పొన్నగంటి శ్రీను, అక్కిలగుంట ప్రకాశం, అంజయ్య ఉన్నారు.

దుర్మార్గపు పాలనను సాగనంపుతాం

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని చిన్నా భిన్నం చేసిన వైసిపి దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 41వ డివిజన్‌లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రి అయితే అవ్వా, తాతలకు నెలకు 4 వేల రూపాయల పెన్షన్ నేరుగా ఇంటివద్దకు తెచ్చి అందిస్తారన్నారు. వైసిపి ప్రభుత్వం ఇష్టారీతిన కరెంటు ఛార్జీలు, నిత్యావసర ధరలు పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలను పీల్చి పిప్పి చేసిందన్నారు. ఒకచేత్తో పది రూపాయలు ఇచ్చి మరో చేత్తో వంద రూపాయలు లాక్కునే ఈ దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాల న్నారు. ప్రస్తుతం వైసిపి ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎన్నో కష్టాలు పడ్డారనీ ఈ కష్టాలు పోవాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ప్రజలకు అందు బాటులో లేని వ్యక్తులకు ఓటు వేయొద్దని, నిత్యం మీ కోసం అందుబాటులో ఉండే తనను దీవించాలని ప్రజలను కోరారు.

నేడు నేటి భారతం-సవాళ్లుపై సదస్సు

ప్రజాశక్తి-నెల్లూరు

నేటి భారతం-సవాళ్ళ అనే అంశంపై స్థానిక జెట్టిశేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉదయం 10గంటలకు సదస్సు జరుగునని సదస్సు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈసదస్సుకు ముఖ్య అతిథిగా ప్రముఖ రాజకీయ విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ పాల్గొంటున్నారని తెలిపారు. సదస్సుకు హాజరు కాగలరని కోరారు.

టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలోని నేలటూరు పంచాయతీ సర్వరాబాద్ గ్రామంలో శనివారం విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్ 6 పథకాలను గురించి ప్రజలకు వివరించారు. టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి కాకర్ల సురేష్‌ను, నెల్లూరు ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

చంద్రబాబును కలిసిన చెంచలబాబు

ప్రజాశక్తి-ఉదయగిరి: టిడిపి జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ కలిశారు. శనివారం ఆత్మకూరు ఎన్నికల ప్రచారానికి వచ్చిన సందర్భంగా హెలిపాడ్ వద్ద కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ నెల్లూరు పార్లమెంట్‌లోని 7 అసెంబ్లీ స్థానాలు నిలిచేందుకు కృషి చేయాలని తెలిపినట్లు చెంచలబాబు యాదవ్ తెలియజేశారు.

తెలుగు యువత సమావేశం

ప్రజాశక్తి-కావలి: కావలి పట్టణ తెలుగు యువత ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన "బాబును మళ్ళీ రప్పిద్దాం" కార్యక్రమంలో కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బానాయుడు పాల్గొన్నారు. ఆయన ప్రసంగిస్తూ 2024 ఎన్నికల్లో వైసిపి అవినీతి కోటలను బద్దలు కొట్టి, కూటమి ప్రభుత్వాన్ని స్థాపించి ఆంధ్ర రాష్ట్రానికి పునర్వైభవాన్ని తెచ్చే బాబును మళ్లీ రప్పిద్దాం అని పిలుపునిచ్చారు.

పలుచోట్ల వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రచారం చేస్తున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కావలి

కావలి 10వ వార్డులో వైసిపి ఇన్‌ఛార్జ్ కుందుర్తి కామయ్య మాజీమున్సి పల్ కౌన్సిలర్ కుందుర్తి సునీత ఆధ్వర్యంలో కులాలకు, మతాలకు, అతీతంగా, స్నేహాభావంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. 13 వ తేదీన జరుగబోవు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు నేపథ్యంలో కసాయివీధి మూడవీధులలో, ప్రతీ గృహాన్ని సందర్శించి, కరపత్రాలు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రవేశపెట్టిన నవ రత్నాలు గురించి, తెలియజేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ప్రచార కార్యక్రమ ంలో షేక్.ఖాదర్ బాషా, జిలాని, సత్తార్, జాహిర్, దాదా, ఆరున్, రవికుమార్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

మేకపాటి సతీమణి ప్రచారం

ప్రజాశక్తి-ఉదయగిరి: 40 యేళ్లుగా మేకపాటి కుటుంబంపై ఉంచిన నమ్మకంతో ఈసారి తన భర్త ఎంఎల్ఎ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డికి ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను ఎంఎల్ఎ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి సతీమణి మేకపాటి శ్రీదేవమ్మ అభ్యర్థించారు. శనివారం వింజమూరు మండలం యర్రబల్లిపాలెం, కొత్తూరు ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం ను ఆమె ఇంటింటా ప్రచారమును విస్తృతంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకి వివరిస్తూ ప్రతీ ఒక్కరితో ప్రేమ అభిమానాలు పంచుతూ మే 13న జరగనున్న ఎన్నికల్లో ఓటు వేసి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని, ఎంపిగా పోటీ చేయనున్న విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత జనసేన నాయకులు గుడి హరికుమార్ రెడ్డికి లేదని వైసిపి సీనియర్ నాయకులు కావాలి రవికుమార్ అన్నారు. మండలంలోని కాలువ మూల కంద్రిగ వైసిపి కార్యాల యంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రసన్నకుమార్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత నియోజక వర్గంలో ఏ నాయకుడి లేదన్నారు. కార్యక్రమంలో వెన్ను ఉమా మహేశ్వర్ రెడ్డి, గూడూరు సురేష్ రెడ్డి, గుంటక రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప గ్రామంలో శనివారం సర్పంచ్ అనిత, వైసిపి నాయకులు ఆధ్వర్యంలో రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఎన్నికల ప్రచార నిర్వహించారు. రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డికి ప్రజలు అపూర్వ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను చూసి తిరిగి ఆయన సిఎం చేసేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని, ఇచ్చిన హామీలలో 99శాతం నెరవేర్చిన ఏకైక సిఎం జగన్మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, జెడ్‌పిటిసి కీర్తన, సీనియర్ నాయకులు డేవిడ్ పాల్, సాల్మన్ రాజ్, సురేష్, జోషి, రమణయ్య తోటపల్లి సాగర్, నవాజ్, సమీవుల్లా, డబ్బేరు శ్రీధర్, చిన్ని, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు

ఎఎస్‌పేట మండలం గుడిపాడుకు చెందిన టిడిపి నాయకులు బ్రాహ్మణపల్లి లోని మేకపాటి నివాసంలో ఎంఎల్ఎ విక్రమ్ రెడ్డి సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంపై ప్రతి ఒక్కరూ నమ్మకం కలిగి ఉన్నారని, సంక్షేమాభివృద్ధి ఆంధ్రప్రదేశ్‌లో నెంబర్ 1 స్థానంలో నిలబెడతారన్నారు. ఆయనవెంట ఎఎస్‌పేట మండల నాయకులు ఉన్నారు.

టిడిపిలోకి పలువురు చేరిక

పార్టీలో చేరిన దృశ్యం

ప్రజాశక్తి-ఉదయగిరి

బొందల రఘురామి రెడ్డి ఆధ్వర్యంలో 50 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలోకి చేరాయి. శనివారం దుత్తలూరు మండలంలో తెలుగుదేశం మండల నాయకత్వంలో బొందల రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎంఎల్ఎ కంభం విజయరామి రెడ్డి సారథ్యంలో ఉదయగిరి ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి కాకర్ల సురేష్ సమక్షంలో రఘురామిరెడ్డి వర్గం సుమారు 50 కుటుంబాలు వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వీరందరికి కాకర్ల సురేష్ కంభం విజయరామిరెడ్డిలు తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాధారంగా పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొందల రఘురామి రెడ్డి మాట్లాడుతూ మేకపాటి కుటుంబం రాజుల పాలన చేస్తుందని పార్టీ కోసం ఎంత కష్టపడినా చెప్పుడు మాటలకు ప్రాధాన్యత ఇచ్చి పార్టీ కోసం పనిచేసే వారిని అవమానాలకు గురి చేస్తున్నారన్నారు. 40యేళ్లుగా మెట్ట ప్రాంతానికి వారు చేసింది శూన్యమన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. వైసిపి ప్రభుత్వంలో ఇసుక మైనింగ్ మద్యం ద్వారా వేలకోట్ల రూపాయలు సంపాదిస్తూ ప్రజల నెత్తిన భారం మోపుతున్నారన్నారు. రాష్ట్రం అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా తయారైందన్నారు. రైతులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రస్తుతం పాలిస్తున్న పాలకులు గత 40యేళ్లుగా సాగు, తాగునీరు అందిస్తామని కల్లబొల్లి మాటలు చెబుతున్నారే తప్ప ఆచరణ లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో టిడిపి ప్రభుత్వంలో 24వేల కిలోమీటర్లు రోడ్లు వేస్తే ప్రస్తుత ప్రభుత్వంలో 1000 కిలోమీటర్లు రోడ్డు వేసిన పాపాన కూడా పోలేదన్నారు. సంక్షేమం పేరుతో బటన్ నొక్కుతున్న జగన్ పది రూపాయలు ఇచ్చి 100 లాగుతున్నారన్నారు. వీటన్నింటిని నివారించాలన్నా రాజధాని నిర్మాణం జరగాలన్నా నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. ఇద్దరు సేవమూర్తులు మనకు అభ్యర్థులుగా రావడం ఒక వరమని అందువల్లే ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి కాకర్ల సురేష్‌ను, నెల్లూరు ఉమ్మడి ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో నియోజకవర్గ ప్రజలు గెలిపించాలని అభ్యర్థించారు. శిముని హజరత్ రెడ్డి, కల్లగుంట మధుసూదన్ రెడ్డి, కల్లగుంట నారాయణరెడ్డి, కల్లగుంట వెంకటేశ్వర రెడ్డి, కల్లగుంట శ్రీనివాసులు రెడ్డి, కల్లగుంట సుబ్బారెడ్డి, కల్లగుంట రమణారెడ్డి, కల్లగుంట వెంకటరెడ్డి, సూరే కృష్ణారెడ్డి, శిముని చిన్న హజరత్ రెడ్డి, శిముని రెండో హజరత్ రెడ్డి, శిముని మూడవ హజరత్ రెడ్డి, వాసుపల్లి అంజిరెడ్డి, వాసుపల్లి వెంకట నరసారెడ్డి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు.

బాలయ్యతో మాట్లాడుతున్న నాయకులు

బాలయ్యతో అగ్ర నేతలు భేటీ

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

నెల్లూరులో శుక్రవారం హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ చేపట్టిన స్వర్ణాంధ్ర సాధికార యాత్ర అనంతరం ఆయన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నివాసంలో రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా శనివారం నెల్లూరు నగరంలోని కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నివాసంలో బాలయ్యతో మాజీ మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ, ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రలు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. వారు తాజా రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చ జరిపారు. ప్రజలలో టిడిపి పై ఆదరణ పెరిగిందని ఎన్నికల్లో గెలిచి తీరాలని చెప్పినట్లు సమాచారం.

ప్రచారం చేస్తున్న సింధు

సోమిరెడ్డి కుమార్తె సింధు ప్రచారం

ప్రజాశక్తి-వెంకటాచలం

మండలంలోని గుడ్లూరువారిపాలెం లో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కుమార్తె డాక్టర్ సోమిరెడ్డి సింధు రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రాజా యాదవ్, రాధాకృష్ణ నాయుడు, మురళీధర్ రెడ్డి, సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి, దాసయ్య తదితరులున్నారు,

ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

చంద్రబాబు పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి నెల్లూరు సిటీ

సార్వత్రిక ఎన్నికల సమీపించే కొద్దీ అగ్ర నేతల పర్యటనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 28వతేదీ నెల్లూరు నగరం కోటమిట్ట షాదీమంజిల్ లో ఏర్పాటు చేసిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సదస్సులో పాల్గొననున్నారు. ఈ సభను విజయవంతం చేసేందుకు అగ్ర నేతలు రంగంలోకి దిగారు. ఈ నేపథ్యంలో... షాదీమంజిల్‌లో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ ఏర్పాట్లను...టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ లతో కలిసి...మాజీ మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ పరిశీలించారు. ఆదివారం జరగనున్న ముస్లిం మైనార్టీల ఆత్మీయ సదస్సు... 54 డివిజన్ల నుంచి ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో తరలినున్నారని...ఎవరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని నారాయణ సూచించారు. ముస్లిం మైనార్టీలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు విశేషంగా తరలొచ్చి...చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో...టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, టీడీపీ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ అగ్రనేతలు పాల్గొననున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
ఆదివారం 28 ఏప్రిల్ 2024

ఏకతాటికి రాని టిడిపి నాయకులు

- వర్గ పోరుతో ఆందోళనలో కార్యకర్తలు

కాకర్ల సురేష్

బొల్లినేని రామారావు

ప్రజాశక్తి-కొండాపురం

మండలంలో టిడిపి అగ్ర నాయకుల్లో వర్గ విభేదాలు రోజు రోజుకి పెరుగుతున్నాయి. గతంలో ఉదయగిరి నియోజకవర్గంలో ప్రాతినిధ్యం వహించిన బొల్లినేని వెంకట రామారావు గ్రూపు ఓవైపు ప్రస్తుతం బరిలో ఉన్న కాకర్ల సురేష్ గ్రూపు మధ్య సాయోధ్య కుదరడం లేదు. ప్రతి గ్రామంలో రెండు గ్రూపులున్నాయి. పట్టుమని 20 రోజుల్లో ఎన్నికలు ఉన్నాయి. వీరు ప్రచారాల్లో కూడా వేరువేరుగా ఉండడమే దీనికి నిదర్శనం. దీంతో వైసీపీకు బలం చేకూర్చినట్లు అవుతుంది. గతంలో ఉన్న సీనియర్ నాయకులు కాకర్ల సురేష్ గ్రూపుతో ప్రతి విషయంలోనూ విభేదిస్తున్నట్లు సమాచారం. సాయి పేట కొమ్మి , భీమవరపాడు గరిమినపెంట గొడవల్లూరు ఆదిమూర్తి పురం వంటి గ్రామాలలో రెండు నుంచి మూడు గ్రూపులు ఉన్నాయి. ఇక్కడ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు తీసుకున్న పెద్దలు ఈ గ్రూపులన్నింటిని ఒక్కతాటిపైకి తెచ్చే క్రమంలో విఫలమయ్యారని చెప్పొచ్చు. ఎవరికి వారిని ప్రోత్సహిస్తూ ఎవరు పని వాళ్లు చేయండి అని చెప్పడం వల్ల వారి మధ్య రోజు రోజుకి ఆధిపత్య పోరు పెరుగుతూనే ఉంది తప్ప తగ్గడం లేదు. ఈ క్రమంలో ప్రత్యర్థి పార్టీ అయినా వైసీపీలో సాయిపేట కొమ్మి, నేకునాపేట, గుడవలూరు వంటి గ్రామాలలో తప్ప వైసీపిలో ఆధిపత్య పోరు ఎక్కడ లేదు. ఈ క్రమంలో టిడిపిలోని గ్రూపు విభేదాలు వల్ల అత్యధిక పార్టీ ఓట్లు పక్క పార్టీలకు పడే అవకాశం ఉంది. అగ్ర నాయకులు మాత్రం పట్టించుకోకుండా మూర్ఖంగా వెళుతు న్నారు. మండలంలో వైసీపీ లో పెద్ద ఎత్తున అసమ్మతి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఒక్క వైసీపీ కార్యకర్తను కూడా టిడిపిలోకి తెచ్చు కోలేక పోవడం దీనికి నిదర్శనం. కాకర్ల సురేష్‌కు టికెట్ అనౌన్స్ చేయకముందు మండలంలో టిడిపికి భారీ మెజార్టీ వస్తుందనుకున్న తరుణంలో కాకర్ల టికెట్ అనౌన్స్ చేసిన తర్వాత బొల్లినేని గ్రూపు కొంతకాలం దూరంగా ఉండటం ఆ తర్వాత కలిసిన ఒకరినొకరు నమ్మకపోవడం గ్రూపులు గాని ఉండడంతో తిరిగి మండలంలో వైసీపీ ఓటర్లను ఆకట్టుకునే పనిలో ఆ పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నారు. ఇకనైనా అధిష్టానం పెద్దలు చొరవ తీసుకొని టిడిపి నాయకులను ఒక్క తాటిపై తేకపోతే మండలంలో భారీగా నష్టం చూడాల్సి ఉంటుందని ఆ పార్టీ కార్యకర్తలు అంటున్నారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి మండలంలో 2500 ఓట్లు మెజార్టీ వచ్చాయి. 2019 ఎన్నికల్లో ఐదువేల ఓట్లు ఆ పార్టీ వెనుకబడింది. దీనికి కారణం పార్టీలో సయోధ్య లేకపోవడమే రేపు జరగనున్న ఎన్నికల్లో మీరు ఇలాగే ఎవరికి వారే అన్నట్లు వ్యవహరిస్తే 2019 లాగా మరలా జరిగిన ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదు. దీనిపై అభ్యర్థి కాకర్ల సురేష్ లేదా ఆ పార్టీకి సంబంధించిన నియోజకవర్గం జిల్లా పెద్దలు దృష్టి సారించి నాయకులను మందలించుకుంటే ప్రమాదం తప్పేలా లేదు.

వైసిపితో యువత భవిష్యత్తు అంధకారమే..

ప్రజాశక్తి-కొండాపురం

కాకర్లకు ఘన స్వాగతం పలుకుతున్న నాయకులు

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని నమ్ముకుంటే యువత బతుకు అంధకారమేనని ఉదయగిరి శాసనసభ అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని గరిమినపెంట, ఇసుక దామర్ల, తూర్పు ఎర్రబెల్లి పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి యువకులను ముంచేశారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి యువత అన్యాయం చేశాడన్నారు. ఇప్పటివరకు ఒక్క ఉద్యోగ నియామకం కూడా జరగలేదన్నారు. తిరిగి రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వస్తే ఉద్యోగ అవకాశాలను కల్పించడమే కాకుండా వెనకబడ్డ ఉదయగిరి ప్రాంతంలో నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి ప్రభాకర్ రెడ్డితో కలిసి తాను ఈ ప్రాంతంలో కంపెనీలను తెచ్చేందుకు చొరవ తీసుకుంటామని తెలిపారు. తమకు ఓటు వేసి గెలిపిస్తే ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తానని ఈ ప్రాంతంలో కంపెనీలను తీసుకొచ్చి చదువుకున్న యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. వైసిపి పాలనలో బడుగు బలహీన వర్గాలకు ఒరిగిందేమీ లేదని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జిల్లా పరిషత్ మాజీ మాజీ చైర్మన్ చెంచల బాబు యాదవ్, యరవా కృష్ణయ్య, అల్లిక మధు, అన్నం సుబ్బారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ఏలూరు రాజేష్, ఏలూరు వెంకటరమణ, గుంటుపల్లి మాధవ, దగడ మాలకొండ రెడ్డి, నామ మహేష్, గంటా లక్ష్మీ, నరసింహులు, వెంకటాద్రి, బట్లగుంట హరిబాబు, చంద్రబాబు, గద్దె రామకృష్ణ, కుంకుమ మోహన్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సోమిరెడ్డికి 'డూ ఆర్ డై'

- అందరిచూపు సర్వేపల్లి నియోజకవర్గం వైపు..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ సర్వేపల్లి నియోజకవ ర్గం (కూటమి) అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి 2024 ఎన్నికలు 'డూ ఆర్ డై'గా మారాయి. ఈ ఎన్నికల్లో గెలుపు రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మకంగా మారినప్పటికీ ప్రత్యేకించి సోమిరెడ్డికి మాత్రం "చావో రేవో" అన్న చందంగా మారాయని చెప్పొచ్చు. ఎందుకంటే టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గత 2019 ఎన్నికల వరకు సర్వేపల్లి నియోజకవర్గంలో మాజీ మంత్రి చంద్రమోహన్ రెడ్డి నాలుగు పర్యాయాలు ఓటమిపాలయ్యారు కాబట్టి.

సర్వేపల్లిలో సోమిరెడ్డి రాజకీయ ప్రస్థానం :

సర్వేపల్లిలో సోమిరెడ్డి రాజకీయ ప్రస్థానం 1994లో ప్రారంభమైంది. సివి శేషారెడ్డి (కాంగ్రెస్)పై సోమిరెడ్డి (టీడీపీ) 1994-1999 రెండు సార్లు పోటీ చేశారు. 1994 ఎన్నికల్లో శేషారెడ్డిపై సోమిరెడ్డి 33,775 ఓట్ల భారీ మెజారిటీ (డిపాజిట్ గల్లంతు)తో, అలాగే 1999 ఎ న్నికల్లో16,092 ఓట్ల మెజారిటీతో సోమిరెడ్డి గెలుపొందారు. 2004-2009లో ఆదాల ప్రభాకర్ రెడ్డి (కాంగ్రెస్)పై పోటీ చేసిన రెండు సార్లు సోమిరెడ్డి (టీడీపీ) ఓడిపోయారు. 2004 ఎన్నికల్లో 7,625 ఓట్లతో, 2009లో 10,284 ఓట్ల తేడాతో సోమిరెడ్డిపై ప్రభాకర్ రెడ్డి గెలిచారు. 2014-2019లో ప్రస్తుత మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి (వైసీపీ)పై పోటీ చేసిన రెండు సార్లు సోమిరెడ్డి (టీడీపీ) ఓటమి చెందారు. 2014 ఎన్నికల్లో 5,446 ఓట్లతో, 2019 ఎన్నికల్లో 13,973 ఓట్ల తేడాతో సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డిపై మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి విజయం సాధించారు. ఈ మేరకు సోమిరెడ్డి వరుసగా రెండు సార్లు ఆదాల ప్రభాకర్ రెడ్డి చేతిలో, మరో రెండు సార్లు గోవర్ధన్ రెడ్డి చేతిలో ఓడి పోయారు. ఈ లెక్కన సర్వేపల్లి ని యోజకవర్గంలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వరుసగా నాలుగు సార్లు ఓటమి చెందారు. ఇప్పటికే వరుసగా నాలుగు సార్లు ఓడిపోయిన నేపథ్యంలో ఐదోసారి పోటీ చేస్తున్న ఈ ఎన్నికలు సోమిరెడ్డి చం ద్ర మోహన్ రెడ్డికి "డూ ఆర్ డై" అని చెప్పక తప్పని పరిస్థితి. ఈ ఎన్ని కల్లో విజయం సాధించాలన్న ధృడ సంకల్పంతో సోమిరెడ్డి అడుగులు వే స్తున్నారు. ఈ క్రమంలో ప్రజల్లో పలుకుబడి ఉన్న నాయకులపై చంద్ర మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఆర్థిక లావా దేవీల నేపథ్యంలో రాజకీయంగా విబేధించి తన నుంచి విడిపోయిన నాయకులను తిరిగి రప్పించుకొనేందుకు సోమిరెడ్డి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ముత్తుకూరు మండల రాజకీయాల్లో చక్రం తిప్పిన ఈదూరు రామ్మోహన్ రెడ్డి (ముత్తుకూరు), మునుకూరు రవి కుమార్ రెడ్డి (మునునూరు బాబిరెడ్డి) చం ద్రమో హన్ రెడ్డి చెంత చేరిపోయారు. ఈ ఎన్నికల్లో ఈ ఇద్దరి నాయకుల ప్రభావం కనిపిస్తుందన్న అభిప్రాయాన్ని ముత్తుకూరు మండల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే విధంగా తోటపల్లి గూడూరు, వెంకటాచలం, మనుబో లు మండలాల్లో, ప్రత్యేకించి గెలుపోటములను నిర్ధారించే పొదలకూరు మండలంపై సోమిరెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఎందుకంటే ఈ ఎన్నికలే చం ద్ర మో హన్ రెడ్డి రాజ కీయ భవిష్య త్తును నిర్ణయించ నున్నాయి కాబట్టి. ఏదేమైనా వరుస ఓటములను మూట కట్టుకొని వస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి ఈ ఎన్నికలు "చా వో రేవో" తేల్చనున్నాయని రాజ కీయ విశ్లేషకులు భావి స్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అందరి దృష్టి సర్వేపల్లి నియోజకవర్గంపై పడింది.

ప్రజా ఉద్యమాలకు దిక్సూచి 'సిపిఎం'

- హామీల అమలుకు 42 రోజుల పాటు అంగన్‌వాడీ సమ్మె
- దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్మికుల ఆందోళన

మున్సిపల్ కార్మికుల కోసం ధర్నా చేస్తున్న దృశ్యం (ఫైల్)

ప్రజాశక్తి-నెల్లూరు

గత ఎన్నికల సమయంలో వైసిపి నాయకులు చేసిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ 42 రోజుల పాటు ప్రభుత్వంతో పోరాటం చేసి విజయం సాధించారు. పాదయాత్రలు చేసే సమయంలో, 2019 అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయాల్లో అంగన్‌వాడీలకు చేసిన హామీలను అమలు చేయాలంటూ అంగన్‌వాడీల చేసిన అవిశ్రాంతి పోరాటం ఉద్యోగ, ఉపాధ్యాయ పోరాటాలకు దిక్సూచిగా నిలిచింది. సమ్మె ప్రారంభమైన తొలి నాటి నుంచే ప్రభుత్వం వైపు నుంచి అనేక రకాల బెదిరింపులు ఎదురయ్యాయి. ప్రభుత్వం అధికారుల సహకారంతో అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగుల గొట్టించి అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుంటామని ప్రకటించినా పట్టువదలకుండా తమకు చేసిన హామీలు అలుచేసే వరకు పోరాటం విరమించేది లేదంటూ పోరాటం చేశారు. అంగన్‌వాడీలు 42 రోజుల పాటు చేసి వారి న్యాయమైన 11 డిమాండ్లను సాధించుకొని ఎన్నో ప్రజా ఉద్యమాలకు ఒక దిశా నిర్దేశం చేశారు. అంగన్‌వాడీల 24 గంటల పాటు కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేపట్టి ప్రభుత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేశారు. అంగన్‌వాడీలు చేస్తున్న పోరాటాన్ని పోలీసుల సహాయంతో అణిచివేయాలని ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు చేసినప్పటికీ, పోరాటానికి అండగా నిలిచిన సిఐటియు నాయకులను అరెస్టు చేసి వాహనాల్లో ఎక్కించి పోలీసు స్టేషన్‌కు తరలించేందుకు చేసిన ప్రయత్నాలను అంగన్‌వాడీలు అడ్డుకున్న తీరు ఎప్పటికీ మరువలేనిది. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టడం, ఎస్మా చట్టాన్ని అమలు చేయడం, టెర్మినేషన్ చేస్తున్నట్లు ఉత్తర్వులు విడుదల చేయడం వంటి దుశ్చర్యలకు వైసిపి ప్రభుత్వం పాల్పడింది. ప్రభుత్వ చర్యలను ప్రతిఘటిస్తూ చలో విజయవాడ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొని తమకు చేసిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కోటి ఇరువై లక్షల సంతకాలను సేకరించి మహిళా శక్తిని చాటుకున్నారు. చివరకు మంత్రి వర్గం అంగన్‌వాడీ యూనియన్ నాయకులతో భేటీ అయి సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించడంతోపాటు అందుకు సంబంధించిన మినిట్స్ బుక్‌లో రాసుకొని సంతకాలు చేసుకున్నారు. మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 16 రోజుల పాటు సమ్మెబాటపట్టారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆ పరిస్థితులను మార్చి మెరుగైన పరిస్థితులను కల్పిస్తానని జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చినందునే కార్మిక వర్గం యావత్తు మద్దతు ఇచ్చి అధికారాన్ని కట్టబెట్టింది. అధికారం లోకి వచ్చిన తర్వాత గడచిన నాలుగున్నర సంవత్సర కాలంలో కార్మికులకు చేసిన వాగ్దానాలు మరిచిపోయింది. తమకు చేసిన వాగ్దానాలు అమలు కోసం అనేక రకాల ఆందోళనలు నిరసనలు విజ్ఞప్తులు చేసిన ఫలితం లేకపోయింది. విధిలేని పరిస్థితులలో నిరవధిక సమ్మెలోకి కార్మిక వర్గం వెళ్లింది. ప్రభుత్వం కార్మికుల ఉద్యమాన్ని నీరు కార్చేందుకు, కార్మికుల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా ఎస్మా ప్రయోగాలు, ఉద్యోగాల నుంచి తొలగింపు బెదిరింపు నోటీసులు జారీ చేస్తూ నియంత్రత్వ ధోరణి అవలంభించింది. కార్మిక వర్గ ఉద్యమాలను చూసిన ప్రభుత్వాలు ఏవి కూడా చరిత్రలో కాలగర్భంలో కలిసిపోయాయని, ప్రభుత్వం తన వైఖరి మార్చుకుని చేసిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పోరాటాన్ని ఉధృతం చేశాయి. చివరకు ప్రభుత్వం ఓ మెట్టు దిగివచ్చి మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి అంగీకారం తెలియజేసింది. జెన్కో థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ప్రయివేటీకరణ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ సమాచారం తెలుసుకున్న సిపిఎంకు అతీతంగా అన్ని కార్మిక సంఘాలకు చెందిన ట్రేడ్ యూనియన్ల సమన్వయంతో 396 రోజుల పాటు జెన్కో థర్మల్ విద్యుత్తు కేంద్రం ఎదుట రక రకాల పద్ధతుల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. ఎపి జెన్కో పరిరక్షణ పోరాట కమిటీ పేరుతో రాజకీయ పార్టీలన్నింటినీ కలుపుకొని, అన్ని ట్రేడ్ యూనియన్లు, కార్మికులు, ప్రజాసంఘాలు ఐక్యంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలల్లో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అదే విధంగా నగరంలో మానవహారం, జెన్కో థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి నగరానికి స్కూటర్ ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వ ప్రయత్నాన్ని అడ్డుకోవడంలో సిపిఎం కీలక భూమికను పోషించింది. గ్రామాల్లో పాదయాత్రలు, అదే సమయంలో సిఎం చేస్తున్న జిల్లా పర్యటనను అడ్డుకోవడం, రాష్ట్ర స్థాయి నాయకులతో చలో జెన్కో కార్యక్రమం నిర్వహించింది. ఈ చలో జెన్కో కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసుల చేసిన ప్రయత్నంలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, ఆలిండియా మహిళా సంఘం నాయకురాలు, ఐద్వా ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ మరియం థావలే, పుణ్యవతి తదితర నాయకులు హాజరై కార్మికులు చేస్తున్న ఆందోళనకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్మికులు చేస్తున్న ఉద్యమం తీవ్రతరం అవుతుండంటో ప్రభుత్వం జెన్కో థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని ప్రయివేటీకరణ చేసే ఆలోచన విరమించుకుంటున్నట్లు ప్రకటన విడుదల చేసింది. కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ మరో ప్రాంతానికి తరలిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పోర్టు కార్మికులు వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టారు. కార్మికులు చేస్తున్న ఆందోళనకు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటించింది.అందులో భాగంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా, నగరంలో మహా ప్రదర్శన సైతం నిర్వహించగా రాష్ట్ర స్థాయి నాయకులు హాజరయ్యారు. ఎన్నికలు పూర్తయిన తరువాత ఈ పోరాటం తీవ్రతరం కానున్నది.

ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)

అంగన్‌వాడీలపై పోలీసుల పైశాచికత్వం (ఫైల్)

మత స్వాతంత్ర్యాన్ని హరించే పార్టీలను ఓడించండి..

- సామాజిక మహిళా కార్యకర్త సి.శారద

ప్రజాశక్తి-కావలి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మత స్వాతంత్ర్యాన్ని హరించే పార్టీలను, వ్యక్తులను ఓడించాలని సామాజిక మహిళా కార్యకర్త చాకలకొండ శారద ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75యేళ్లు, రాజ్యాంగం అమలై 64 ఏళ్లయింది. ఏ సార్వత్రిక ఎన్నికల ప్రచారంలోనూ ఇప్పటిలా హిందూత్వం "రాజ్యాంగ విరుద్ధంగా శిఖరాగ్రంలో లేదన్నారు. ఎన్నో కుల - మతాల అభ్యర్థులు ప్రధానులుగా పనిచేశారని, ఇప్పటి ప్రధానిలా ఏ ఒక్క మతాన్నో భుజాన వేసుకుని రాలేదన్నారు. ఇతర మతాలను నీచంగా తూలనాడుతూ, అల్పసంఖ్యాక మతస్థులకు భయభ్రాంతులకు గురిచేస్తూ ప్రచారాలు చేయలేదన్నారు. మణిపూర్‌లో క్రైస్తవులుగా మరీనా కుకీ మైనారిటీలకు, వారింటి మహిళలకు జరిగిన అక్రమాలు, అత్యాచార - నగ్న ఊరేగింపుల అన్యాయాన్ని మరువకూడదన్నారు. గోద్రా అల్లర్లు, బిల్కిస్ బాను ఘోర దుర్మార్గాన్ని, ఆమెను అకృత్యానికి కారకులైన రేపిస్టులను విడుదల చేయడమేగాక, వారికి చేసిన సత్కారాలను స్వీట్లు పంచుకోడాన్ని మరువ కూడదన్నారు. ముస్లిం సోదర సోదరీమణులు తమ హిందూత్వ పార్టీకి తప్ప ఇతర పార్టీలకు ఓటేస్తే, గెలిపిస్తే, హిందూ మహిళల మంగళ సూత్రాలను ముస్లిములు లాక్కువెళ్తారని, తమను గెలిపిస్తే, ముస్లిము రిజర్వేషన్లను ఎత్తేస్తామని హెచ్చరిస్తూ, భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను నిర్భీతిగా అవహేళన చేస్తున్నారన్నారు. మైనారిటీలు, మహిళలకు తీవ్ర ఘోరాలు చేస్తామంటున్న మతతత్వ పార్టీని మొదలు తెగిపడేలా పరాజయం పాలు చేయడానికి మైనారిటీలు, మహిళా ఓటర్లు బద్ధ కంకణులు కావాలన్నారు. మధ్య తరగతి వర్గం, మేధావులు, విద్యావంతులు, నూతన ఓటర్లయిన 18యేళ్లు నిండిన యువత విజ్ఞతతో ఓటెయ్యాలని కోరారు. ప్రాణత్యాగాలు చేసి స్వాతంత్ర్యం సాధించి పెట్టిన, ప్రజాస్వామ్యం, రాజ్యంగాలను ప్రసాదించిన జాతీయనేతల త్యాగాలను, కృషిని గుర్తుపెట్టుకుని భావిభారతాన్ని కాపాడుకునేలా ఓటర్లు తమ పవిత్ర ఓటు అనే ఆయుధాన్ని విజ్ఞతతో వినియోగించుకోవాలని శారద పిలుపునిచ్చారు.

ఇండియా ఫోరమ్ అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి-కావలి

మాట్లాడుతున్న పొదలకూరి కళ్యాణ్

మతతత్వ ఎన్.డి.ఎ. కూటమి, రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న వైసిపిని ఓడించేందుకు కాంగ్రెస్, వామపక్ష పార్టీలు, దళిత సంఘర్షణ సమితి బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కావలి అసెంబ్లీ అభ్యర్థి పొదలకూరి కళ్యాణ్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక రావులకొల్లు వారి వీధిలోని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో అయన వామపక్ష నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒకనాటి రాజన్న రాజ్యం తీసుకోచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రాన్ని గత పదేళ్లు పరిపాలించిన టిడిపి, వైసిపిలు ప్రత్యేక హోదా రాకుండా చేశారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టను పూర్తికాకుండా చేశారన్నారు. ఇక కావలిలో వైసిపి ఎంఎల్ఎ, టిడిపి అభ్యర్థులు చూస్తే దోపిడీకి ప్రతిరూపాలుగా ఉన్నారన్నారు. కేంద్రంలో మతతత్వ మోడీని గద్దె దింపి, రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చేయాలనీ కాంగ్రెస్ మిత్రపక్ష పార్టీలు పోరాడుతున్నాయని తెలిపారు. కావలిలో తన గెలుపు తథ్యమన్నారు. తాను గెలిచిన తర్వాత పేదింటి ఆడపడుచులకు లక్ష రూపాయలు నగదు, తాళిబొట్లు అందజేస్తానని హామీనిచ్చారు. కావలి అసెంబ్లీ అభ్యర్థిగా, ఎంఎల్ఎగా తనను, నెల్లూరు పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి విశ్రాంత కలెక్టర్ కొప్పుల రాజును అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని పొదలకూరి కళ్యాణ్ అభ్యర్థించారు. సమావేశంలో సిపిఐ కార్యదర్శి కొప్పర్తి నాగరాజు, సిపిఎం కార్యదర్శి పి. పెంచలయ్య, దళిత సంఘర్షణ సమితి వ్యవస్థాపక జిల్లాఅధ్యక్షులు ఎస్.మల్లి పాల్గొన్నారు.

ప్రజల తలరాతలు మార్చే ఎన్నికలు..

ప్రజాశక్తి వరికుంటపాడు

ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

మండలంలోని గొల్లపల్లి, సంఘం, మహమ్మదాపురం, పాపన్నగారిపల్లి గ్రామాలలో టిడిపి ఎన్నికల ప్రచారంలో భాగంగా "బాబుని మళ్లీ రప్పిద్దాం" కార్నర్ మీటింగ్‌ను మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి కాకర్ల సురేష్ సతీమణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తలరాత మార్చే ఎన్నికలను ఆలోచించి మంచి నిర్ణయం తీసుకొని టిడిపికి ఓటు వేయాలని పేర్కొన్నారు. ఇంటింటా పర్యటించి సైకులు గుర్తుకు ఓటు ఓటర్లను అభ్యర్థించారు. టిడిపి తీసుకొచ్చిన మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకం ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ చంద్ర వెంకయ్య, గంగవరం పుల్లయ్య, మాజీ సర్పంచ్ ప్రభాకర్ నాయుడు, వైస్ ఎంపిపి మధు, బాల గురవారెడ్డి, ఉమామహేశ్వరరావు, భోగినేని శ్రీనివాసులు, జనసేన మండల అధ్యక్షులు నాయబ్ రసూల్, తెలుగు యువత లక్ష్మీనారాయణ, శివరామయ్య, రవి, మధు, రమేష్, మద్దిపాటి రమేష్, అరోణ్, అంకయ్య, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

దీపం గ్యాస్ కోసం తప్పని తిప్పలు..

- దీపం గ్యాస్ పాయింట్ ఎత్తివేతపై ఆగ్రహం
- ఉదయగిరిలో ఇచ్చేలా అధికారులు చర్యలు

ప్రజాశక్తి-ఉదయగిరి

ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ఉదయగిరి పాయింట్ ఎత్తేయడంతో దీపం వినియోగదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని దాంతో ఒక గ్యాస్ బండల్ కొనుగోలు చేయాలంటే బుక్ చేసి ఎదురు చూడాల్సిన దుస్థితి ఎదురవుతుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరి తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఈ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ పాయింట్ దుత్తలూరుకు మారడంతో అనేక ఇబ్బందులు వినియోగదారులు ఎదుర్కోవాల్సి వస్తుందని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడ నుండి అన్ని మండలాలకు కూడా గ్యాస్ బండలు సరఫరా అవుతుండేవని, లక్షల రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన గోడౌన్ కూడా ఇప్పుడు నిరుపయోగంగా దర్శనమిస్తుంది. ఇంత వ్యవస్థ ఉన్నప్పటికీ గ్యాస్ ఏజెన్సీ ఎందుకు తరలించారనేది ఎవరికీ అర్థం కాకుండా పోయిందని వినియోగదారులు పలువురు పెదవి విరుస్తున్నారు. ఉదయగిరి పాయింట్ అందరికీ సరిహద్దుగా ఉండేదని, అత్యవసరమైన లబ్ధిదారులు ఉదయగిరికి వచ్చి ఏజెన్సీలో గ్యాస్ బండను తీసుకొని వెళ్లేవారు. కానీ ఏజెన్సీ ఇక్కడ నుంచి తరలించటంతో దీపం గ్యాస్ లబ్ధిదారులకు మరింతగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక కుటుంబానికి దీపం గ్యాస్ పథకం కింద మంజూరు అయితే ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం వర్తించదు, డబ్బు పెట్టి ప్రయివేట్ గ్యాస్‌ను కొనుగోలు చేసే శక్తి పేదలకు లేదు బుకింగ్ చేసుకొని వారి పరిస్థితి అయితే మరి దారుణంగా మారిందన్నారు. ఉదయగిరి అయితే ఎప్పుడైనా వచ్చి సిబ్బందితో బుకింగ్ చేయించుకొని సిలిండర్ తీసుకువెళ్లేవారమని కానీ ఇప్పుడు దత్తులూరు కేంద్రానికి వెళ్లాలంటే చుట్టుపక్కల దీపం లబ్ధిదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఏజెన్సీ పాయింట్‌కు చేరుకోవాల్సిన దుస్థితి ఎదురవుతుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉదయగిరి నియోజకవర్గంలోని దీపం లబ్ధిదారులు మళ్లీ కట్టెల పొయ్యినే ఆశ్రయించే విధంగా తమ తలరాతలు మారయని వినియోగదారు లబోదిబోమంటున్నారు. ఇటీవల దత్తలూరు ఏజెన్సీ పాయింట్ వద్ద గొడవలకు దారితీసాయని జిల్లా ఉన్నత అధికారులు స్పందించి తీసివేసిన ఇండియన్ గ్యాస్ ఏజెన్సీని తిరిగి ఉదయగిరిలోనే పునరుద్ధరిం చాలని జిల్లా ఉన్నత అధికారులను దీపం ఇండియన్ గ్యాస్ వినియోగదారులు కోరుతున్నారు.

ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డి ప్రచారం

ప్రజాశక్తి-సంగం

ప్రచారం నిర్వహిస్తున్న ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి

మండలం వెంగారెడ్డిపాళెం, మర్రిపాడు గ్రామాలలో శనివారం వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి మేకపాటి విక్రమ్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డికి వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తూ ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఆయన తీసుకొచ్చిన సంస్కరణలే సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం పేదరికాన్ని తగ్గుముఖం పట్టించేందుకు ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చారని తెలిపారు. ఐదు సంవత్సర కాలంలో జిడిపిలో రాష్ట్రం 14వ స్థానం నుంచి 4కు వచ్చిందని, పారిశ్రామికాభివృద్ధి, వ్యవసాయాభివృద్ధిలో 2వ స్థానంలో, ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో మొదటి స్థానంలో, డ్రాప్ అవుట్స్ నివారణతో కేరళతో సమానంగా ఉన్నామన్నారు. ఇంకా సంక్షేమాన్ని అధికంగా కొనసాగించేందుకు అమ్మఒడి పథకాన్ని రూ.15వేల నుంచి రూ.17వేలు చేశారని, ద్వారా మహిళలకు రూ.లక్షల వరకు రుణాలు, పింఛను రెండు విడతల్లో రూ.3300 వరకు పెంపు, నేతన్న నేస్తం రూ.1.20 లక్షల నుండి రూ.2.40 లక్షల వరకూ పెంపు, కాపు నేస్తం, వైఎస్ఆర్ చేయూత, ఈబీసీ నేస్తం, వాహన మిత్ర లాంటి పథకాలన్నింటినీ ప్రస్తుతం అందజేస్తున్న సంక్షేమం రెండింతలు చేశారన్నారు. కార్యక్రమంలో గ్రామ ఎంపిటిసి మధుసూదన్ రెడ్డి, ముడి మల్లికార్జున రెడ్డి, సర్పంచ్ సురేష్, వైసిపి మండల కన్వీనర్ శంకర్‌రెడ్డి, వైసిపి నాయకులు రఘునాథ్ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు శివకుమార్ రెడ్డి, మధన్ మోహన్ రెడ్డి, చంద్రా రెడ్డి, చందన్ కుమార్, ఫణీంద్ర రెడ్డి, బాల నాయుడు, ప్రసాద్ రెడ్డి, కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైలెవెల్ కెనాల్ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-మర్రిపాడు

త్వరలో జరుగనున్న శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు సోమశిల హై లెవెల్ కెనాల్ పనులు పూర్తి చేస్తామని వాగ్దానం చేసి మెట్టప్రాంత రైతులు, ప్రజలను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పుచ్చల పల్లి సుందరయ్య భవన్ సిపిఎం కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమశిల హైలెవెల్ కెనాల్ ప్రాజెక్ట్ నియోజకవర్గంలోని మర్రిపాడు, ఆత్మకూరు, అనంతసాగరం, ఉదయగిరి దుత్తలూరు వింజమూరు మండలాలు సోమశిల ప్రాజెక్టుకు కూతవేటు దూరంలో ఉన్న ఎత్తులో ఉన్నందున గ్రావిటీ ద్వారా నీరందడం లేదన్నారు. ఈ ప్రాంతాల్లో శాశ్వత కరువుందన్నారు. భూగర్భ జలాల్లో ఫ్లోరిన్ అధికంగా

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉన్నందున ఈ నీరు తాగడం వల్ల నిత్యం రోగాలు భారిన పడుతున్నారన్నారు. రైతుసంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు అనంతరం 2012లో ప్రాజెక్ట్ మంజూరు కాగా 2014లో పనులు ప్రారంభించారన్నారు. కానీ 10యేళ్ళ గడిచినా మొదటి దశ పనులు పూర్తి కాలేదన్నారు. 2020లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హైలెవెల్ కెనాల్ రెండో దశ పనులను వర్చువల్‌గా ప్రారంభించారన్నారు. రెండో దశ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందన్నారు. 2013లో రూ.853కోట్ల వ్యయంతో మొదలు పెట్టినా మొదటి దశ పనులు రూ.459కోట్లతో ప్రారంభించినా, రెండో దశ పనులు ఆలస్యమైనందున నిర్మాణ వ్యయం రూ.1700 కోట్లకు చేరిందన్నారు. పడమటి నాయుడుపల్లి నుండి భీమవరం రిజర్వాయర్ 13కిలో మీటర్ల కెనాల్ నిర్మాణం, పొంగూరు రిజర్వాయర్ పూర్తయినా అసంపూర్తిగా ఉందన్నారు. ఇస్కపల్లి, పెగళ్లపాడు రిజర్వాయర్ల నిర్మాణం ప్రారంభించి ఆపేశారన్నారు. కీలకమైన పంపుసెట్లు తుప్పు పట్టి పాడై పోయాయి. కార్యక్రమంలో మండల కార్యదర్శి రహంతుల్లా, సిఐటియు మండల కార్యదర్శి రత్నయ్య, సీనియర్ నాయకులు సూర్యనారాయణ, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఆనం సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

టిడిపిలోకి చేరికలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని చిన్న మాచనూరు పంచాయతీ నుండి కొమ్మి జయచంద్ర ఆధ్వర్యంలో పలు కుటుంబాలు ఆనం సమక్షంలో వైసిపి నుండి టిడిపిలో చేరారు. వీరందరికీ ఆత్మకూరు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి, మాజీ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఉప సర్పంచ్ మదిముక్కు కీర్తి సాగర్, పావులూరు వెంకటేశ్వర్లు, పావులూరి సుందరరామయ్య, తలపనేని వెంకటరామయ్య, తలపనేని శ్రీనివాసులు, తలపనేని రాకేష్, కుంకు వెంగళ రవి, కుంకు రమేష్, కుంకు హరికృష్ణ, నూతలపాటి రామకృష్ణ, నూతలపాటి మారుతి, నూతలపాటి ప్రేమ్‌కుమార్, నూతలపాటి వెంకటరమణయ్య, పొదిలి పాపయ్య, దాసరి పాపారాయుడు, దాసరి పెంచలయ్య, దాసరి తిరుపాలు, నూతలపాటి రమణయ్య, ఆర్ల శ్రీనివాసులు, నూతలపాటి నరసింహులు, దాసరి పెంచలరావు, మందల తిరుపతయ్య, నూతలపాటి వినయ్ కుటుంబాలు టిడిపిలో చేరాయి. కార్యక్రమంలో టిడిపి పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుట్ట బ్రహ్మానందరెడ్డి, సీనియర్ నాయకులు తాళ్లూరి గిరి నాయుడు, బుల్లెట్ రమణ పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా : మేకపాటి

ప్రజాశక్తి-ఉదయగిరి

మూల గ్రామాల ప్రజలకు మేకపాటి కుటుంబంగా తానెప్పుడూ అండగా ఉంటానని ఒక్కసారి అవకాశం ఇచ్చి తనను గెలిపించాలని ఎంఎల్ఎ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి ప్రజలను అభ్యర్థించారు. శనివారం మండల పరిధిలోని అయ్యవారిపల్లి, దేకురుపల్లి, బండగానిపల్లి, అన్నంపల్లి, పుల్లాయిపల్లి, శకునాలపల్లి గ్రామ పంచాయతీల్లో అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు తన ప్రభుత్వం ద్వారా మంచి జరిగి ఉంటే మరోసారి వైసిపికి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరిన ముఖ్యమంత్రి జగనన్న అన్నారు. గత 40 సంవత్సరాల నుంచి మేకపాటి కుటుంబం ఈ ప్రాంతాన్ని సొంత ప్రాంతంగా భావించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసిందని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో లేవన్నారు. జరగనున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపి అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డికి ఎంఎల్ఎ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో

గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం పుల్లాయపల్లి సర్పంచ్ కల్లూరి శామలదేవి కృష్ణ రెడ్డి స్వగృహంలో భోజనం అనంతరం శకునాలపల్లి పంచాయతీలో సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో విస్తృత పర్యటన చేపట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సిఎం ఓబుల్ రెడ్డి, ఎంపిపి మూలె పద్మజ వినయ్ రెడ్డి, మాజీ ఎంపిపి చేజర్ల సుబ్బారెడ్డి, సొసైటీ అధ్యక్షులు కల్లూరి రమణారెడ్డి, జెడ్‌పిటిసి మోడీ రామాంజనేయులు, మాజీ సర్పంచులు అక్బుల్ రెడ్డి, మూలే సుబ్బారెడ్డి, ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతయ్య, ఉదయగిరి ఉపసర్పంచ్ ముర్తుజా, నాయకులు కల్లూరి రాజారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాగళం సభకు బయల్దేరుతున్న నాయకులు

ప్రజాగళానికి తరలిన నాయకులు

ప్రజాశక్తి-మర్రిపాడు

ఆత్మకూరులో టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన ప్రజాగళానికి నాయకులు తరలివెళ్లారు. టిడిపి నాయకులు మాలపాటి వెంకటేశ్వర్లు నాయుడు, ముప్పాళ్ల వెంకట్ చౌదరి, గంగినేని శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో వాహనాలలో నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.



పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో చేరిన నాయకులు

నెల్లూరు 11వ డివిజన్‌లో..

ప్రజాశక్తి-నెల్లూరు : టిడిపి ప్రభుత్వంలో 11వ డివిజన్లలో అభివృద్ధి చూశామని అదే అభివృద్ధి చూడాలని వైసిపి నుండి టిడిపిలో చేరుతున్నామని వైసిపి నేత పొడమేకల శ్రీనివాసులు యాదవ్ తెలిపారు. గడచిన ఐదు సంవత్సరాలలో డివిజన్ పరిధిలో అభివృద్ధి శూన్యమన్నారు. ఈ సందర్భంగా ఆత్మీయ ఆహ్వానం మాజీ మంత్రి నారాయణ పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్, మామిడాల.మధు షేక్.కరిముల్లా పాల్గొన్నారు.

నాయకులతో 'కావ్య' సంప్రదింపులు

ప్రజాశక్తి-కావలి

పట్టణంలోని 4, 5 వార్డులో పలువురు ముఖ్య నాయకులతో టిడిపి బిజెపి జనసేన ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి శనివారం సంప్రదింపులు జరిపారు. జరగనున్న సార్వత్రిక ఎన్నికలు గురించి తగు సలహాలు సూచనలు తెలియజేశారు. ఆయనవెంట పోతుగంటి శ్రీకాంత్, చిలకపాటి శ్రీనివాసులు 4,5 వార్డులోని కార్యకర్తలు పాల్గొన్నారు.

భవిష్యత్తును ఆలోచించి ఓటేయాలి

- రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రాష్ట్ర భవిష్యత్తును ఆలోచించి ప్రజలందరికీ సంక్షేమాభివృద్ధిని అందించాలనే సంకల్పంతో వ్యవహరించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారని, అలాంటి వ్యక్తిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాజ్యసభ సభ్యులు, బిసి సంఘాల జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో నియోజకవర్గ స్థాయి బిసిల ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వాల కాలంలో లీడర్లు బాగుపడ్డారని, జగన్మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు బాగుపడుతున్నారన్నారు. సొంత మామను వెన్నుపోటు పొడిచి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని తెలిపారు. సిఎం జగన్మోహన్ రెడ్డి తన సొంత ఛరిష్మాతో రాష్ట్ర ప్రజలు అందరినీ పాదయాత్రతో పలకరించి వారి ఆదరాభిమానాలతో ముఖ్యమంత్రి అయ్యారన్నారు. ఆయన పాలనకు తిరుగులేదని, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించే ఆయన పాలనను మరోసారి తీసుకురావాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. బిసిలకు జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని, 12మంది ఎంపిలుగా, 48 మందికి రానున్న ఎన్నికల్లో ఎంఎల్ఎలుగా పోటీ చేసేందుకు అవకాశం ఇచ్చిన ఘనత ఆదర్శ ముఖ్యమంత్రి ఆయనేనని కొనియాడారు. సిఎం ముందుచూపుతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను నాడు - నేడు పథకంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడంతో పాటు ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టారన్నారు. దాంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బిసి, దళిత విద్యార్థులు ఇంగ్లీషు మీడియం చదివేందుకు



మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

అవకాశం కలిగి వారికి ఉజ్వల భవిష్యత్ ఏర్పడనుందన్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి కార్పొరేట్ పాఠశాలల్లో చదివించే బాధ తల్లిదండ్రులకు తగ్గడంతో ఆర్థిక భారం తప్పిందన్నారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు మాట్లాడుతూ మాదేశ్ క్రితమే పార్లమెంటులో బిసిల రిజర్వేషన్ల బిల్లు ప్రతిపాదించేలా తమను ప్రోత్సహించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అనంతరం రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. బిసిల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ కేటాయించాలని కేంద్రానికి ప్రతిపాదించింది వైఎస్ జగన్మోహన్ రెడ్డే అని అన్నారు. రూ.2 లక్షల కోట్లతో బిసిల కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని కేంద్రానికి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు లేఖను ఇచ్చామన్నారు. సిఎం సామాజిక న్యాయం పాటించేలా రాష్ట్రంలో బిసిలకు 50శాతం రిజర్వేషన్లు అమలయ్యేందుకు కృషి చేస్తున్నారన్నారు. కులగణన చేపట్టాలని నిర్ణయించింది దేశంలో బీహార్ తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనన్నారు. 54 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆయా వర్గాలకు మేలు జరిగేలా సిఎం కృషి చేస్తున్నారన్నారు. 11 రాజ్యసభ స్థానాలకుగాను 5మంది బిసిలకు స్థానం కల్పించిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డిదేనన్నారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ముస్లిం మైనార్టీకి ఎంఎల్ఎకు సీటు కేటాయించగానే రాద్ధాంతం చేసి పార్టీలో నుంచి వెళ్లిపోయారన్నారు. అయితే రాజ్యసభ పదవీకాలం ఇంకా ఉన్నా త్యాగం చేసి పార్టీ తరుపున నెల్లూరు ఎంపిగా పోటీ చేస్తున్న వేణుంబాక విజయసాయిరెడ్డి ఘన విజయం సాధిస్తారని తెలిపారు. తనకు రాజ్యసభ స్థానం ఆయన వల్లే దక్కిందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మైనార్టీలకు 6 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే దానిని అడ్డుకుంటూ చంద్రబాబు కోర్టులో కేసు వేశారని, దాంతో ముస్లిములకు నాలుగు శాతం రిజర్వేషన్లు ఖరారయ్యాయని, ఇలాంటి మోసగాడు చంద్రబాబు ప్రజలు నమ్మబోరన్నారు. ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ బిసిలు అంటే బ్యాక్‌బోన్ లాంటి వారని, వారికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నియోజకవర్గానికి ప్రత్యేక మేనిఫెస్టో తయారు చేసి ఆ మేరకు అభివృద్ధి చేస్తారన్నారు. మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి మాట్లాడుతూ బిసిలకు సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి బిసిలంతా సంఘటితంగా తయారై మద్దతు తెలపాలని కోరారు. నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో జనరల్ స్థానాల్లోనూ బిసిలను నిలబెట్టి గెలిపించిన ఘనత జగన్మోహన్ రెడ్డిదేనన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమాలు అందిస్తున్న సిఎం ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. ఎంఎల్ఎ, ఎంపి స్థానాల్లో ఎన్నికల్లో పోటీ చేసేందుకు బిసిలకు అధిక సీట్లు కేటాయించిన పార్టీ వైసిపియేనని తెలిపారు. నెల్లూరు పార్లమెంటు విజయసాయిరెడ్డి, ఆత్మకూరు, ఉదయగిరి స్థానాల్లో మేకపాటి విక్రమ్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్ రెడ్డిలు ఘన విజయం సాధించనున్నారన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు జెసిఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, చేజర్ల జెడ్‌పిటిసి పీర్ల పార్థసారథి, అనంతసాగరం ఎంపిపి పేయ్యల సంపూర్ణమ్మ, జిల్లా బిసిసెల్ నాయకులు మురళీకృష్ణ, చిల్లూరు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం..

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

పేద ప్రజల కోసం నారా చంద్రబాబు నాయుడు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని ..తాజాగా సూపర్ సిక్స్ పథకాలు వల్ల లబ్ధిదారులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని నెల నెలా నాలుగు వేల రూపాయలు పెన్షన్ తో పాటు సంక్షేమ పథకాలను గడపగడపకు చేరవేరుస్తారని ప్రజలందరూ టిడిపికి పట్టం కట్టాలని మాజీ మంత్రి, నెల్లూరు సిటీ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి పేర్కొన్నారు. 48 డివిజన్ ఎస్, ఆర్, ఎస్, కళ్యాణమండపం.. 13వ డివిజన్ నేతనగర్, లక్ష్మీ నగర్, బ్యాంకు కాలనీ పలు ప్రాంతాలలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ, సూపర్ సిక్స్ పథకాలను

ప్రచారం చేస్తున్న నారాయణ సతీమణి రమాదేవి

ప్రజలకు వివరిస్తూ, సైకిల్ గుర్తుకు ఓటు వేసి వి,పి, ఆర్, నారాయణను గెలిపించాలని కోరారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ వైసిపి యువతను మోసం చేసిందని ఉద్యోగాలు రాక చాలా ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్న, పథకాలు ఇంటింటికి చేరాలన్న, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న నారా చంద్రబాబునాయుడు కే సాధ్యమన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే మెగా డిఎస్సిపై నారా చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేస్తారన్నారు.వైసీపీ పాలనలో ప్రజలందరూ విసిగిపోయారని, కరెంటు బిల్లులు, నిత్యావసర సరుకులు పెరిగిపోయాయని, మధ్యతరగతి కుటుంబం బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. చివరికి ప్రజలపై చెత్త పన్ను కూడా వేసి భారం మోపిందన్నారు. టిడిపి వస్తేనే రాష్ట్రం బాగుపడటంతో పాటు ప్రజలకు భద్రత ఉంటుందని ప్రజలే తెలుపుతున్నారన్నారు. నారా చంద్రబాబు నాయుడు పరిశ్రమలు తీసుకొచ్చి ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి, యువతకు ఉద్యోగం వచ్చేంతవరకు 3 వేల రూపాయలు నిరుద్యోగ భృతిని అందిస్తారన్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం చంద్రబాబు మళ్లీ రావాలన్నారు. యువత ఉజ్వల భవిష్యత్తు కోసం తెలుగుదేశం పార్టీ తరఫున పార్లమెంటు సభ్యులుగా పోటీ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,ని నెల్లూరు నగర శాసనసభ్యులుగా పోటీ చేస్తున్న పొంగూరు నారాయణలను అమూల్యమైన ఓటు వేసి ఆశీర్వదించాలని, అభ్యర్థించారు.

బిసిల ద్రోహి చంద్రబాబు

ప్రజాశక్తి-ఉదయగిరి

మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడును నమ్మితే నట్టేట మునిగినట్లేనని బిసిల నమ్మకద్రోహిని రాజ్యసభ సభ్యులు బిసి నాయకులు ఆర్ కృష్ణయ్య విమర్శించారు. శనివారం ఉదయగిరిలోని వైసిపి పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో పచ్చి అబద్ధమని ఆంధ్ర రాష్ట్ర ప్రజలు దానిని గ్రహించాలని ఆయన సూచించారు. గతంలో చెప్పిందేదీ చంద్రబాబు నాయుడు చేయలేదని ఇది మాత్రం చేస్తాడని నమ్మకం ఏమిటని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి మేనిఫెస్టోని ప్రజలకు చెప్పిందే చేస్తాడు కాబట్టి మేనిఫెస్టో రిలీజ్ చేశాడని తెలిపారు. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి పోటీ చేస్తున్నారని, అలాగే ఉదయగిరి నుంచి మేకపాటి రాజగోపాల్ రెడ్డి శాసనసభకు పోటీ చేస్తున్నారని వారిని గెలిపించాలని కోరారు. అనంతరం ఆర్ కృష్ణయ్యను మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆయనతోపాటు పలువురు వైసిపి నాయకులు పూలమాలలు

మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బిసి నాయకులు పిసి అల్లూరు రాజు, సొసైటీ బ్యాంక్ అధ్యక్షులు మూలే వినయ్ రెడ్డి, కల్లూరి రమణారెడ్డి, బట్రాజుల సంఘం అధ్యక్షులు రామరాజు, రాష్ట్ర బిసి మహిళా సంఘం అధ్యక్షురాలు బేబీ రాణి, జెడ్‌పిటిసి మోడీ.రామాంజనేయులు, మాజీ ఎంపిటిసి ఉప్పుటూరి హరి, మండల కన్వీనర్ సిఎం ఓబులరెడ్డి, పాల్గొన్నారు.

చలివేంద్ర ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజలకు సేవ చేయడం మహాభాగ్యంగా భావిస్తున్నానని వైసిపి సీనియర్ నేత, నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ అన్నారు. శనివారం ఆయన స్థానిక ఆమని గార్డెన్స్ లో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా వేసవి కాలంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అత్యవసర సమయాల్లో బయటకు వచ్చే ప్రజలకు ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. తన తల్లిదండ్రులు నూనె కొండయ్య, నూనె రమణమ్మ ల జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఇక్కడ మంచినీట తోపాటు, మజ్జిగ అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో అనేక సేవా కార్యక్రమాలు చేశామన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మేలు జరిగే సేవా కార్యక్రమాలు శక్తి వంచన లేకుండా చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సముచిత స్థానం కల్పిస్తాం..

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

రాష్ట్రానికి పరిశ్రమలు తెప్పించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తారని అంతేకాకుండా మెగా డిఎస్సి ప్రకటించి నిరుద్యోగులకు భరోసా నింపుతుండడంతో యువత టిడిపిలోకి వలసలు వస్తున్నారని కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకూ సముచిత స్థానం కచ్చితంగా కల్పిస్తానని మాజీ మంత్రి, నెల్లూరు సిటీ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ పేర్కొన్నారు.నెల్లూరు గోమతినగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో నారాయణ, నెల్లూరు పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు

కండువా కప్పుతున్న నారాయణ

అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో సిటీ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన పలువురు శనివారం టిడిపిలో చేరారు.పార్టీలో చేరిన వారందరికీ సముచిస్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ యువత భవిష్యత్తు బాగుండాలంటే రానున్న ఎన్నికల్లో ఖచ్చితంగా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సి ఉందన్నారు. చంద్ర బాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రానికి నూతనంగా కంపెనీలు రావడంతో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయ న్నారు. విజన్‌తో ఆలోచించే చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సర్వతో ముఖంగా అభివృద్ధి చెందుతుం దన్నారు. ఆ నమ్మకంతో నేడు టీడీపీలో చేరుం దుకు అందరు ఆసక్తి చూపుతున్నా రన్నారు. ప్రజలందరి ఆశీర్వదంతో ఖచ్చితంగా టీడీపీ ప్రభుత్వం అధికారం లోకి వస్తుందని, సుపరిపాలన అంటే ఏమిటో ప్రజలకు చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. నెల్లూరును అన్నీ విధాలా అభివృద్ధి చేస్తామని మాటిచ్చారు.

వెంకటేశ్వర్లకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-వెంకటాచలం

మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో మెరైన్ బయాలజీ విభాగం పరిశోధన విద్యార్థి వర్ది వెంకటేశ్వర్లకు వివిఎస్‌యు డాక్టరేట్ ప్రదానం చేసింది. జిల్లాలోని దగదర్తి మండలం, తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు బయో ఆక్యుములేషన్ ఆఫ్ టాక్సిస్ మెటల్స్ అండ్ మెటల్లోతయోనిక్స్ ఇన్ సెలెక్టెడ్ మెరైన్ ఫిషెస్ ఆఫ్ నెల్లూరు కోస్ట్ ఇన్ సౌత్ కోస్టల్ ఆంధ్ర ప్రదేశ్ అనే అంశంపై మెరైన్ బయాలజీ విభాగంలో ప్రొఫెసర్ సిహెచ్ వెంకట్రాయిలు పర్యవేక్షణలో పరిశోధన గ్రంథం సమర్పించినట్లు వర్సిటీ పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ ఆర్ మధుమతి తెలిపారు.దీంతో వెంకటేశ్వర్లకు వర్సిటీ

వీసీ.సుందరవల్లి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారావుతో పాటు పలువురు అభినందించారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌సి చంద్రశేఖర్‌రెడ్డి

వైసిపి మేనిఫెస్టోను ప్రజలు హర్షిస్తున్నారు.. పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విలువలతో కూడిన జన రంజికమైన మేనిఫెస్టోను విడుదల చేశారని జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని జిల్లా వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి జిల్లాలో ప్రజాసేవ చేసే వారిని అభ్యర్థులుగా నిలిపారన్నారు.. చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీలో డబ్బు సంచులిచ్చిన వారికే సీట్లు ఇచ్చారన్నారు..నగరంలో పొంగూరు నారాయణ నాలుగున్నర సంవత్సరం అడ్రస్ లేదని ...తనకోసం కష్టపడ్డ వారికి నాలుగున్నరేళ్లుగా కనపడ లేదన్నారు.జిల్లాలో పార్లమెంట్ అభ్యర్థి విజయ సాయి రెడ్డికి నగరంలో ఖలీల్ అహ్మద్ కు విశేష ప్రజాదరణ లభిస్తోందన్నారు. పార్ట్ టైం నాయకుడైన పొంగూరు నారాయణకు నగర ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.. జగన్మోహన్ రెడ్డి సుభిక్షంగా పాలన అందించి అన్ని సంక్షేమ పథకాలు పేదలకు అవినీతికి తావు లేకుండా అందించి ,ఉద్యోగ ఉపాధి కల్పించారన్నారు. చంద్రబాబు తన పాలల్లో 34,000 ఉద్యోగాలు ఇస్తే తమ నాయకుడు జగన్మోహన్ రెడ్డి 4,40,000 ఉద్యోగాలు ఇచ్చిన ఘనుడన్నారు..70 వేల కోట్లు సంక్షేమ కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఖర్చు పెడుతుంటే 1,25,000 కోట్లు చంద్రబాబు నాయుడు ఖర్చు పెడతాం అంటున్నారు.

సోమిరెడ్డి సమక్షంలో చేరిన దృశ్యం

టిడిపిలో 30 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-వెంకటాచలం

నెల్లూరులోని వేదాయపాళెంలోని సోమిరెడ్డి కార్యాలయంలో శనివారం మండలంలోని కాకుటూరు గ్రామానికి చెందిన 30 కుటుంబాలు సోమిరెడ్డి సమక్షంలో వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. వీరికి సోమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో కాకాణి గోవర్ధన్ రెడ్డి చేసిన అరాచకాలు,దౌర్జన్యాలు, అక్రమాలు,అవినీతి మైనింగ్ దోపిడీలతో సర్వేపల్లి ప్రజలు విసిగిపోయారన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు గుమ్మడి రాజా యాదవ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు ఏపీసెట్ పరీక్ష

ప్రజాశక్తి-వెంకటాచలం

ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఏపీసెట్ 2024 పరీక్ష ఈనెల28న ఆదివారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఏపీసెట్ రీజినల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ టి.వీరారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష కోసం నెల్లూరు నగరంలో ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వెంకటాచలం మండలం, కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ, నెల్లూరులోని జగన్స్ డిగ్రీ పీజీ కళాశాల, కృష్ణ చైతన్య డిగ్రీ పీజీ కళాశాల, రావూస్ డిగ్రీ కళాశాల, డీకే డబ్ల్యూ కళాశాల, వి.ఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పిజీ కళాశాలలో జరుగుతున్నాయన్నారు. పరీక్షలకు 1767 మంది హాజరవుతున్నారన్నారు. పరీక్ష కేంద్రాలకు ఉదయం 8:00 గంటలకే చేరుకోవాలని,9:30 గంటలు దాటిన తర్వాత అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరని సూచించారు.

రూ.11.70 లక్షల నగదు స్వాధీనం

నెల్లూరు : ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నగదు, మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకున్నామని ఎస్‌పి కె.ఆరీఫ్ హాఫీజ్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తగిన రశీదులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న చేజెర్ల పోలీసు స్టేషన్ పరిధిలో రూ.11,70,400/- నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ముత్తుకూరు పరిధిలో-6, కొండాపురం-10, ఎస్ఆర్ పురం -18 ఎఫ్‌జె వాష్-1200 లీటర్లు , ఎస్‌ఈబి -187 మద్యం బాటిల్స్ లను సీజ్ చేశామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్ళేటప్పుడు రూ.50వేలకు మించినగదు, ఎక్కువ నగలు తీసుకెళ్లొద్దని, ఒకవేళ అవసరాల రీత్యా తీసుకెళ్తే సంబంధిత ఆధారాలు, ధవీకరణ పత్రాలను అధికారులకు చూపించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని విధిగా పాటించాలన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్

స్ట్రాంగ్ రూమ్‌లు సిద్ధం

ప్రజాశక్తి -నెల్లూరు : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుకు అవసరమైన కౌంటింగ్ కేంద్రాలు స్ట్రాంగ్ రూములను సిద్ధం చేశా మని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అన్నారు. శని వారం రూరల్ మండలం కనపర్తిపాడులోని ఇందిర ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ సెంటర్లను కలెక్టర్ ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిశీలించారు.కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపులు నిర్వహించడానికి ఇందిర ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో నార్త్ బ్లాక్ లో నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కోవూరు, కావలి, ఉదయగిరి, కందుకూరు, ఆత్మకూరు నియోజకవర్గాల సంబంధించి కౌంటింగ్ స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేశామన్నారు. సౌత్ బ్లాకులో సర్వేపల్లికి సంబంధించి కౌంటింగ్ సెంటర్ ను స్ట్రాంగ్ రూమును ఏర్పాటు చేశామన్నారు. సాధారణ ఎన్నికల కౌంటింగ్ నిర్వహించ డానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకున్నామ ని ఎన్నికల కౌంటింగ్ ప్రణాళికను సాధారణ పరిశీలకు కలెక్టర్ వివరించారు. ఎన్నికలసాధారణ పరిశీలకులు రామ్ కుమార్ గౌతమ్, నితిన్ సింగ్ బదూరియా, ట్రైనీ కలెక్టర్ సంజన సిన్హా నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ ,జిల్లా ఎస్.పి ఆరిఫ్ హఫీస్, అదనపు ఎస్పి సౌజన్య, తహశీల్దార్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మతోన్మాద బిజెపిని గద్దెదించండి

ఇండియా బ్లాక్ కాంగ్రెస్ నెల్లూరు ఎంపి అభ్యర్థి కె. రాజు

మాట్లాడుతున్న కె. రాజు

ప్రజాశక్తి-కందుకూరు

మే 13న జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎలక్షన్లలో మతతత్వ పార్టీ అయినా బిజెపి కూటమిని గద్దెదించాలని నెల్లూరు పార్లమెంటరీ ఇండియా బ్లాక్ కాంగ్రెస్‌అభ్యర్థి కొప్పుల రాజు తెలిపారు. కందుకూరు పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్ వద్ద నుండి విక్కిరాల పేట రోడ్డు వరకు శనివారం రోడ్ షో నిర్వహించారు. అనంతరం పొట్టి శ్రీరాములు బొమ్మ వద్ద కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. బహిరంగ సభలో మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు నుంచి కాంగ్రెస్ పార్టీకి ఆదరణ లభిస్తుందన్నారు. పార్టీ పునర్ వైభవానికి ప్రతి ఒక్కరూ శాయాశక్తుల కషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.టిడిపి, వైసిపి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదన్నారు. విభజన హామీలు ప్రత్యేక హోదా గురించి కల్లబొల్లి కబుర్లు చెప్పి బిజెపికి రెండు పార్టీలు తొత్తులుగా పనిచేసేయన్నారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రాగానే మొదటి సంతకం ప్రత్యేక హోదా ఫైల్ పై జరుగుతుందని రాహుల్ గాంధీ తీర్మానం చేశారని తెలిపారు. కందుకూరు అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సయ్యద్ గౌస్ మొహిద్దిన్ మాట్లాడారు. . దేశ అభివద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని ప్రజలు అప్రమత్తమై కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని సిపిఎం నాయకులు ఎస్ఎ గౌస్ తెలిపారు మీడియా ఇన్‌ఛార్జి కాంగ్రెస్ పార్టీ నాయకులు కే సంజయ్ కుమార్, సుధీర్ , బి. శోభన్ బాబు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చింతనబోయిన నరేష్, నెల్లూరు పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్ సిహెచ్ నరేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ చాంద్ బాషా, నాయకులు కొమరగిరి వెంకటేశ్వర్లు ,పొట్లూరు రవి, ఏలూరు నాగర్జున, రవిచంద్ర రాజు శ్రీనివాస్ రాజు ,ప్రకాశం జిల్లా కాంగ్రెస్ నాయకులు శ్రీపతి ప్రకాశం, సతీష్ ఉన్నారు.

సిఎం పర్యటనను జయప్రదం చేయండి : బుర్రా

మాట్లాడుతున్న బుర్రా మధుసూదన్ యాదవ్

ప్రజాశక్తి- కందుకూరు : ఈ నెల 28న ఆదివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కందుకూరుకు వస్తున్నారని, సిఎం ఎన్నికల ప్రచార సభను జయప్రదం చేయాలని కందుకూరు నియోజకవర్గ వైసిపి అసెంబ్లీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ పిలుప ునిచ్చారు. శనివారం స్థానిక పామూరు రోడ్డులోని బుర్రా క్యాంపు కార్యాల యంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా బుర్రా మధు సూదన్ మాట్లాడుతూ ఆది వారం మధ్యాహ్నం 2.00 గంటలకు స్థానిక కనిగిరి రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాల యంలో సిఎం హెలికాప్టర్ దిగుతారన్నాఉ. అక్కడ నుండి రోడ్డు మార్గంలో ఎల్ఐసి ఆఫీసు, అంకమ్మ దేవాలయం, పోస్టాఫీస్ సెంటర్ మీదుగా ఎన్‌టిఆర్ సర్కిల్‌కు చేరుకుని అక్కడ బహిరంగ నిర్వహిస్తారన్నారు. జయప్రదం చేయాలని కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్ తోకల కొండయ్య, వైసీపీ సీనియర్ నాయకులు ఇంటూరి హరిబాబు, ముప్పవరపు కిషోర్, ఇంటూరి మాధవరావు, చీమల వెంకటరాజా, గంగవరపు వెంకట్రావు, పరిటాల వీరాస్వామి, పిచ్చపాటి తిరుపతిరెడ్డి, వరికుటి కష్ణారెడ్డి, పెన్నా కష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

29న ఎన్నికల ప్రత్యేక అబ్జర్వర్ రాక

నెల్లూరు : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి స్పెషల్ జనరల్ అబ్జర్వర్ గా నియ మితులైన రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రామ్మోహన్ మిశ్రా ఈనెల 29న నెల్లూరుకు విచ్చేయనున్నారు. 29వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు నగరానికి చేరుకుని, అనంతరం జిల్లా యంత్రాంగం, కేంద్ర ఎన్నికల పరిశీలకులతో మిశ్రా సమావేశం అవుతారు. సాయంత్రం 7 గంటలకు నెల్లూరు నుంచి తిరుపతి వెళ్తారు.

కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి-కావలి

జనసేన కావలి నియోజ కవర్గం ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో కృష్ణ - పెన్నా వీరమహిళ కమిటీ మెంబర్ నాగరత్నం యాదవ్ ఆధ్వర్యంలో కావలి మున్సిపల్ పరిధి లోని 15వ వార్డ్‌లో శనివారం విస్తృ తంగా ప్రచారం చేశారు. కూటమి అభ్యర్థులైన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని ఎంపిగా, కావ్య క్రిష్ణారెడ్డిని ఎంఎల్‌ఎగా గెలిపించుకోవడం కావలికి ఎంతో అవసం ^మన్నారు. సేవ చెయ్యడానికి వచ్చిన వీరిని గెలిపించి, దొంగలను ఇంటికి పంపుదాం! అనే పిలుపుతో విస్తృత ప్రచారం చేశారు. కార్యక్రమంలో నెల్లూరు నుండి వచ్చిన వీరమహిళలు, జనసేన నాయకులు, జనసైనికులు

ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు

టిడిపిలో 30 కుటుంబాలు చేరిక

వరికుంటపాడు : మండలంలో వైసిపికి మరోషాక్ తగిలింది. మండల పరిధిలోని కనీయంపాడు గ్రామానికి చెందిన 30 కుటుంబాలు, మండల నాయకత్వంలో, మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి పోలుబోయిన శ్రీకాంత్ యాదవ్ సారధ్యంలో వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో ఉదయగిరి ఉమ్మడి ఎంఎల్‌ఎ అభ్యర్థి కాకర్ల సురేష్ సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ కాకర్ల సురేష్ తెలుగుదేశం కండువా కప్పి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి కాకర్ల సురేష్ గత రెండు సంవత్సరాలుగా చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులమై ఆయనకు అండగా నిలవాలని మండల నాయకత్వం ఆధ్వర్యంలో టిడిపిలో చేరమన్నారు. పేదల పక్షపాతి పార్టీ తెలుగుదేశం అన్నారు. నెల్లూరు ఉమ్మడి ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సేవలు అమోఘమన్నారు. కనుక వీరిద్దరి గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. తెలుగుదేశాన్ని గెలిపించి రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. పి.వెంకటేశ్వర్లు పోలుబోయిన బ్రహ్మేశ్వరరావు, సందే పవన్‌కుమార్, గుండ్లపల్లి విజయ కుమార్ తదితరులున్నారు.

ఎన్నికల ప్రచార పర్వం..

వీక్షణం

ప్రజాశక్తి-నెల్లూరు

నామినేషన్ల పర్వం పూర్తి కావడంతో ఎన్నికల ప్రచార పర్వం ఊపందుకుంది. రేపు బరిలో నిలిచేవారి పేర్లు ఖారరు కానున్నాయి. అసెంబ్లీ,పార్లమెంట్ స్థానాలకు పోటీ చేసేందుకు రాజకీయ పార్టీలకు చెందిన వారు, చివరి వరకు పార్టీ టికెట్టు ఆశించి రాని వారు రెబల్ అభ్యర్థులుగా మరి కొంత మంది కులసంఘాలకు చెందిన ఔత్సాహికులు నామినేషన్లు దాఖాలు చేశారు. అధికార పార్టీకి చెందిన అభ్యర్థులు 2019లో జరిగిన ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో ఎంత మెజార్టీ సాధించి గెలుపొందారో ఆ మెజార్టీని అధిగమించి తీరాలన్న లక్ష్యంతో పార్టీ అధినాయకత్వం ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటూ కార్యకర్తల్లో చైతన్యం నింపుతోంది. టిడిపి కూటమి వైసిపి అభ్యర్థులను ఓడించి తీరాలన్న సంకల్పంతో గట్టి అభ్యర్థులను ఎన్నికలబరిలో నిలిపింది. జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించుకోవాలన్న ఉత్సాహంతో ఆ పార్టీ నేతలు సంకల్పంతో ఉన్నారు. ఈ క్రమంలో ప్రముఖ సినీ నటుడు, నందమూరి రామారావు కుమారుడు బాలకృష్ణ జిల్లాకు విచ్చేసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ స్థానానికి టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నామినేషన్ దరఖాస్తులో పూర్తి వివరాలు తెలియజేయలేదని, డిస్క్వాలిఫై చేయాలంటూ పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న విజయసాయిరెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పార్లమెంట్ స్థానానికి పోటీలో నిలిచిన టిడిపి అభ్యర్థి నామినేషన్ ఆమోదంపై చివరి వరకు ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి టిడిపి అభ్యర్థి నామినేషన్‌ను ఓకే చేయడంతో పార్టీ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నాయి. బిజెపి, వైసిపి, జనసేన, టిడిపి పార్టీలను వ్యతిరేకిస్తూ వామపక్షపార్టీలు, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, విసికె పార్టీలు ఇండియా కూటమిగా ఏర్పడ్డాయి. ఈ క్రమంలో నగర నియోజకవర్గం అసెంబ్లీ స్థానానికి 40 ఏళ్ల తరువాత సిపిఎం అభ్యర్థి పోటీ చేస్తున్నారు. జిల్లాలో కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాలకు, పోరాటాలకు సంపూర్ణ మద్దతు ఇస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన సిపిఎం అభ్యర్థి మూలం రమేష్ నగర నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలను కలుపుకోని విస్తృతంగా పర్యటిస్తున్నారు. గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసి అక్షరాస్యత ఉద్యమం, సారా వ్యతిరేక ఉద్యమం వంటి కార్యక్రమాలు పరోక్షంగా మద్దతు ఇచ్చి ప్రజల పక్షాన నిలిచిన కె.రాజును కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ స్థానానికి అభ్యర్థిగా నిలిపింది. జిల్లాతో సన్నిహిత సంబందాలు కలిగి ఉన్న కె.రాజు అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తూ హస్తం గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు.